thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 79 | జగిత్యాల | ఆదివారం | 14 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

అమెరికా ఘన ఆరంభం



11

# బీజేపీలో గ్రేటర్ టెన్షన్



- జీహెచ్ఎంసీ ఎన్నికలపై కమలం అప్రమత్తం
- ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడైనా వస్తుందనే అంచనా
- రిజర్వేషన్ల ప్రకటనతోనే అభ్యర్థుల ఖరారుకు కసరత్తు
- డివిజన్ల వారీగా సర్వేలు.. బూత్ స్థాయి విశ్లేషణ
- చివరి నిమిషం ఇబ్బందులు తప్పించుకోవడమే లక్ష్యం
- కిషన్ రెడ్డి పర్యవేక్షణలో వ్యూహాలకు పదును

**హైదరాబాద్, జూన్ 13:**
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలపై స్పష్టత లేకపోయినా, ఎన్నికల సమరానికి తెలంగాణ బీజేపీ ముందస్తుగా సిద్ధమవుతోంది. జీహెచ్ఎంసీతో పాటు గ్రేటర్ పరిధిలోని ఇతర మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందనే అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్న వేళ కమలం పార్టీ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఎన్నికలు వెంటనే జరుగుతాయని కొందరు అంచనా వేస్తుండగా, ప్రత్యేక ఓటరు జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాతే నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు. అయితే ప్రభుత్వం ఒకసారి ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటే చాలా తక్కువ వ్యవధిలోనే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉందని బీజేపీ నాయకత్వం అంచనా వేస్తున్నట్లు సమాచారం. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్ల అంశాలపై ముందస్తు అవగాహన ఉండే అవకాశం ఉందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. అదే సమయంలో రిజర్వేషన్ల ప్రకటన తర్వాత వెంటనే ఎన్నికలకు వెళితే అభ్యర్థుల ఎంపికలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

మిగతా 3వ పేజీలో..

## బీఆర్ఎస్ వల్లే సింగరేణికి వేల కోట్ల నష్టం

- కోల్ బ్లాకుల వేలంలో పాల్గొనకుండా నిర్వీర్యం
- డేగల్ని, దళారుల్ని అడుగుపెట్టనివ్వం
- సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- 335 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

**మంచిర్యాల, జూన్ 13 :**
సింగరేణిని బతికించుకుంటాం.. కార్మికులను రక్షించుకుంటాం అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాలలో సంస్థలో 335 మందికి కారుణ్య నియామక పత్రాలు

మిగతా 2వ పేజీలో..





## మహిళా సాధికారతకు కొత్త దిశ

- ఆర్థిక స్వావలంబన నుంచి రాజకీయ నాయకత్వం వరకు..
- మహిళా వారోత్సవాలు విజయవంతం

**హైదరాబాద్, జూన్ 13:**
మహిళలను సంక్షేమ పథకాల లబ్దిదారులుగా కాక రాష్ట్ర అభివృద్ధికి చోదక శక్తులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహించిన మహిళా వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మే 25 నుంచి 31 వరకు నిర్వహించిన ఈ వారోత్సవాలు మహిళల ఆర్థిక, సామాజిక, విద్య, ఆరోగ్య, రాజకీయ సాధికారతకు కొత్త ఊపునిచ్చాయి. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం

మిగతా 2వ పేజీలో..

## హైదరాబాద్‌లో భారీ వర్షం

- అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

2




**వర్షాలపై హై అలర్ట్**

అధికార యంత్రాంగానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

2

## అసలు ఓట్లు తొలగించే కుట్ర : కేటీఆర్

**రాజన్న సిరిసిల్ల,జూన్13:**
రాష్ట్రంలో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆరోపించారు. 'సర్' ప్రక్రియను బీఆర్ఎస్ సీరియస్‌గా తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్‌లాగా దొంగ ఓట్లతో గెలవాలని తాము అనుకోమని తేల్చిచెప్పారు. రైతు భరోసా వేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతన్నలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను బురిడీ కొట్టించారని ఎద్దేవా చేశారు. 'సర్' పేరుతో అసలైన ఓట్లను తొలగిస్తే ఊరుకోమని కేటీఆర్ హెచ్చరించారు.





### షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

- మహిళలను కించపరిచేలా వ్యాఖ్యల వ్యవహారంలో

2

## హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'లో మంత్రి శ్రీధర్ బాబు

2




## టీఆర్ఎస్ టైటిల్‌పై ఉత్కంఠ




- కవిత పార్టీ పేరుకు ఈసీ వద్ద వందల అభ్యంతరాలు
- టీఆర్ఎస్ పేరుపై మహారాష్ట్ర సంస్థలూ హక్కు
- తెలంగాణ సెంటిమెంట్‌తో ముడిపడి ఉందంటూ బీఆర్ఎస్ ఫిర్యాదు
- ఎన్నికల సంఘం నిర్ణయంపై రాజకీయ వర్గాల దృష్టి
- తెలంగాణ రక్షణ సేన పేరుపై కొనసాగుతున్న చర్చ

3



### బీజేపీ కుట్రలకు మీనాక్షి బలి

- కేసు లేకున్నా నామినేషన్ తిరస్కరణ : మహేశ్ కుమార్

3



### ఫోన్ ట్యాపింగ్.. మంత్రి తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

**హైదరాబాద్, జూన్ 13 :**
ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. గతంలో ట్యాపింగ్‌కు గురైన వాటిలో మంత్రి

మిగతా 3వ పేజీలో..

## వైమానిక దళంలోకి 245 మంది క్యాడెట్లు

- దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఘనంగా పాసింగ్ అవుట్ పరేడ్
- క్యాడెట్లకు అభినందనలు తెలిపిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- ఆపరేషన్ సిందూర్ స్ఫూర్తితో దేశ రక్షణకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- నారీశక్తికి నిదర్శనంగా మహిళా క్యాడెట్లను ప్రశంసించిన రాజ్‌నాథ్

**హైదరాబాద్, జూన్ 13:**
హైదరాబాద్‌లోని దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పాసింగ్ అవుట్ పరేడ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న క్యాడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. భారత వైమానిక దళంలో చేరబోతున్న యువ అధికారులకు అభినందనలు

మిగతా 3వ పేజీలో..





### సింగరేణిపై దృష్టి పెట్టండి

- అవకతవకల వార్తలు పరిశీలించి చర్యలు తీసుకోండి
- ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

3



# హైదరాబాద్‌లో భారీ వర్షం

- పలు ప్రాంతాల్లో రహదారులు జలమయం
- అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

హైదరాబాద్,జూన్ 13:
హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

**హై అలర్ట్ ప్రకటించాలి : ముఖ్యమంత్రి**
రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి,అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతోపాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.

**వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డీజీపీ పరిశీలన**
హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో డీజీపీ సి.వి. ఆనంద్ వర్ష ప్రభావిత ప్రాంతాలను శనివారం సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. టోలిచౌకి పరిసరాల్లోని మల్కంపేట చెరువు ప్రాంతంతోపాటు సమీప ప్రాంతాలను పరిశీలించి, నీటి నిల్వలు, ట్రాఫిక్ అంతరాయాలు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతితో డీజీపీ సమావేశమై ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ కోసం తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. రోడ్లపై నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ రద్దీని నివారించాలని, సాధారణ పరిస్థితులను త్వరగా పునరుద్ధరించేందుకు పౌర సంస్థలతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, కీలక కూడళ్ల వద్ద తగిన సంఖ్యలో సిబ్బందిని మోహరించి ట్రాఫిక్ నియంత్రణతోపాటు ప్రయాణికులకు అవసరమైన సహాయాన్ని అందించాలని సూచించారు. అదేవిధంగా హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని వర్ష ప్రభావిత జిల్లాలన్నింటిలోని పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాల కారణంగా తలెత్తే ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని డీజీపీ ఆనంద్ ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ సంస్థలు, మున్సిపల్ అధికారులతో సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు సకాలంలో సహాయం అందించాలని ఫీల్డ్ అధికారులకు సూచించారు. ప్రజలు ప్రయాణాల సమయంలో జాగ్రత్తలు పాటించాలని, నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లరాదని, పోలీసులు, ఇతర ప్రభుత్వ సంస్థలు జారీ చేసే అధికారిక సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం నెలకొన్న వర్ష పరిస్థితులను తెలంగాణ పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ప్రజల భద్రత, సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర సేవల వేగవంతమైన స్పందన కోసం కట్టుబడి పనిచేస్తున్నారని పునరుద్ఘాటించారు.

# వర్షాలపై హై అలర్ట్



హైదరాబాద్, జూన్ 13:
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.
శనివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం వర్షాల పరిస్థితిపై చర్చించారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో హై అలర్ట్ ప్రకటించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**సమన్వయంతో పనిచేయాలి**
వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సీఎం సూచించారు. రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బృందాలను మోహరించాలని ఆదేశించారు. మున్సిపల్, పోలీస్ శాఖలు నిరంతరం అప్రమత్తంగా ఉండి పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
లోతట్టు ప్రాంతాల్లో ముందుగానే విపత్తు నిర్వహణ బృందాలను ఏర్పాటు చేయాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డు, మున్సిపల్, పోలీస్ శాఖలు కలిసి ట్రాఫిక్ మళ్లింపు, నీటి తొలగింపు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ధికారుల నిరంతర పర్యవేక్షణ**
వర్షాల పరిస్థితిని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ, సంబంధిత ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించడంతో పాటు ఎలాంటి అత్యవసర పరిస్థితులైనా ఎదుర్కొనేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

# బీఆర్ఎస్ వల్లే సింగరేణికి వేల కోట్ల నష్టం

మొదటిపేజీ తరువాయి
శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బీఆర్ఎస్‌లపై నిప్పులు చెరిగారు. రెండు పార్టీలు బయటకు కొట్లాడుతున్నట్టు నటిస్తూ లోలోపల ఇద్దరు ఒకటిగా మారిపోయి ప్రజలను మోసం చేస్తున్నాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ లాంటిదని, కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సంస్థలోని డిపెండెంట్ ఎంప్లాయిస్ సమస్యలపై స్పందిస్తూ ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కారుణ్య నియామకాల ప్రక్రియను వేగవంతం చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎంతోమంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు.. వారి దరఖాస్తులను త్వరలో పరిశీలించి అర్హులైన వారికి ఇదేవిధంగా బహిరంగ సభ ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించారు. సింగరేణి యాజమాన్యాన్ని ఈ దిశగా సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామన్నారు. ప్రజా ప్రభుత్వం సింగరేణిని దోపిడీ చేసే ప్రభుత్వం కాదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎల్పీ లీడర్‌గా ఆదిలాబాద్ జిల్లాలో చేసిన సుదీర్ఘ పాదయాత్రను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో బొగ్గు గనులను సందర్శించి కార్మికుల గుండె చప్పుళ్లను స్వయంగా విన్నానని చెప్పారు. రాబోయేది ఇందిరమ్మ రాజ్యమని, సింగరేణిని ప్రజల ఆస్తిగా కాపాడుకుంటామని చెప్పానని గుర్తు చేశారు. ఏ దోపిడీదారుల కబంధ హస్తాల్లోనూ, దేగలు, రాబందులు చేతుల్లోనో సింగరేణిని పడనీయమని డిప్యూటీ సీఎం ప్రకటించారు.

**దేశ చరిత్రలోనే తొలిసారిగా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా**
కార్మికుల ఆరోగ్యం, భద్రతపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి దేశంలోని మరే ప్రభుత్వానికి లేదని పునరుద్ఘాటించారు. ఏ సంస్థలోనూ లేని విధంగా సింగరేణి కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే రూ. కోటి 25 లక్షల ప్రమాద బీమాను అందిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ పథకం కింద ఇప్పటికే దాదాపు రూ.40 నుంచి రూ.45 కోట్ల విలువైన చెక్కులను బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం నియామక పత్రాల పంపిణీ మాత్రమే కాదని, కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్న నమ్మకం, భరోసా, ధైర్యమని భట్టి చెప్పారు. కార్మికులకు రూ.10 లక్షల వరకు మెగా హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. గతంలో కేవలం 40వేల మంది పర్మనెంట్ ఉద్యోగులకే ఇచ్చేవారన్నారు. సింగరేణి చరిత్రలోనే మొట్టమొదటిసారిగా 30వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు బోనస్ ప్రకటించిందని ఆయన గర్వంగా ప్రకటించారు.

**సింగరేణికి నష్టం కలిగించింది బీఆర్ఎస్సే**
b4సింగరేణిని కాంగ్రెస్ ప్రభుత్వం దోపిడీ చేస్తోంది అంటూ బీఆర్ఎస్ నేత హరీష్ రావు చేస్తున్న ఆరోపణలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. సింగరేణికి నష్టం చేసింది ఎవరైనా ఉన్నారంటే అది బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం మాత్రమే అని చెప్పారు. 2014 లో టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చే వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని కోల్ బ్లాకులన్నీ సింగరేణికే అప్పగించేవారు. బీఆరఎస్ వచ్చాక సింగరేణికి రావలసిన కోల్ బ్లాకులు రాకుండా కుట్రపూరితంగా అడ్డుకున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. దొంగే దొంగ అన్నట్లు బీఆరఎస్, బీజేపీ నాటకాలు ఆడుతున్నాయన్నారు. సింగరేణిలో బొగ్గు కదలాలన్నా అత్యంత పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉందని, అలాంటి సంస్థపై అభాండాలు వేస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి పరిధిలోని కోల్ బ్లాకులను తమకు అనుకూలమైన ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే దుర్మార్గపు కుట్రతోనే బీఆరఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. హరీష్ రావు ఒక లేఖ రాస్తారు.. ఢిల్లీ నుంచి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించి మాట్లాడుతుంటారని వీరి మధ్య ఉన్న అంతర్గత బంధాన్ని ఎండగట్టారు. పదేళ్లు మంత్రిగా చేసిన హరీష్ రావు తన మంత్రి హోదాను మరిచి రోజుకో అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కోయగూడెం బ్లాక్ వేలంలో సింగరేణి పాల్గొనకపోవడం వల్ల దాదాపు 67 మిలియన్ టన్నుల బొగ్గును సంస్థ కోల్పోయిందని చెప్పారు. మార్కెట్ విలువ దాదాపు రూ.29,106 కోట్లు ఉంటుందని, తద్వారా సింగరేణికి రావాల్సిన రూ.19,360 కోట్ల లాభం చేజారిపోయిందని మండిపడ్డారు. సత్తుపల్లి బ్లాక్6కు ఆనుకుని ఉన్న సత్తుపల్లి బ్లాక్3 వేలంలో సింగరేణి పాల్గొనకుండా అడ్డుపడ్డారని ఆరోపించారు. ఎనిమిదేళ్ల కాలంలో మైనింగ్ చేసుకునే అవకాశం ఉన్న కోయగూడెం బ్లాక్‌లో 32 మిలియన్ టన్నుల బొగ్గు అందుబాటులో ఉందన్నారు. సింగరేణి వేలంలో పాల్గొనకపోవడం వల్ల ఉత్పత్తి లేక రూ.10,032 కోట్ల ఆదాయం నష్టం వాటిల్లిందని చెప్పారు. దీని ద్వారా రావాల్సిన రూ.2,624 కోట్ల నికర లాభాన్ని సింగరేణి నష్టపోయిందన్నారు. వేలం నిబంధనల ప్రకారం బ్లాకులు దక్కించుకున్న వారు మైనింగ్ చేయలేకపోతున్నారు.. పైగా సమయం ముగిసింది.. మరి ఆ బ్లాకులను తిరిగి సింగరేణికే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని రాతపూర్వకంగా కోరనన్నారు. తెలంగాణ ప్రతినిధిగా ఉన్నా ఆ బ్లాకులను సింగరేణికి ఎందుకు ఇప్పించలేకపోతున్నారని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. సింగరేణిని కాపాడుకోవడమే కాక కార్మికుల న్యాయబద్ధమైన హక్కులన్నింటినీ ఈ ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని స్పష్టం చేశారు. కొద్దిరోజులుగా జరుగుతున్న అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ కార్మిక లోకానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. వేలాదిమంది కార్మికుల చెమట, శ్రమ పునాదులపై నిర్మితమైన సింగరేణి సౌధాన్ని కూల్చాలని హరీష్ రావు, కిషన్ రెడ్డిల ఆధ్వర్యంలో కుట్రలు జరుగుతున్నాయని భట్టి ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే నిర్ణయం తీసుకుని ఈరోజు 335మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందించామని చెప్పారు. భవిష్యత్తులోనూ ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. సింగరేణిలో మెడికల్ ఇన్వాలిడేషన్ అనేది కార్మికుల హక్కు అని, దాన్ని కాదనడానికి ఎవరికీ వీల్లేదని స్పష్టం చేశారు. దీనిపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను అరికట్టడానికి, ఈ ప్రాంత మంత్రులు, శాసనసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికుల అసలు సమస్యలను చర్చించినట్లు తెలిపారు. తక్షణమే న్యాయబద్ధంగా మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డును ప్రారంభించి చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్యపై లోతుగా అధ్యయనం చేసి భవిష్యత్తులో ఎలాంటి న్యాయ సమస్యలు రాకుండా ఉండేందుకు ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.
సింగరేణి బోర్డు స్వయం ప్రతిపత్తి కలిగినదని గుర్తుచేశారు. రోజువారీ నిర్ణయాలలో, కార్యకలాపాలలో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని, ప్రభుత్వానికి దాంతో సంబంధం ఉండదని వివరించారు. దాదాపు 135 సంవత్సరాల క్రితం నిర్ణయించుకున్న నిబంధనల ప్రకారం, ఆ బోర్డు తన స్వయం ప్రతిపత్తితోనే సింగరేణి అభివృద్ధికి అవసరమైన నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు.

# మహిళా సాధికారతకు కొత్త దిశ

మొదటిపేజీ తరువాయి
సహాయక సంఘాల బలోపేతం, బాలికల్లో నాయకత్వ లక్షణాల పెంపు, మహిళల భద్రత, పారిశ్రామిక ప్రోత్సాహం, అక్షరాస్యత, బాల్య వివాహాల నిర్మూలన, చిన్నారుల సంక్షేమం వంటి విభిన్న అంశాలపై వారం రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా వేలాది కార్యక్రమాలు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, సెర్ప్, మెప్మా, అంగన్‌వాడీ వ్యవస్థ, వివిధ ప్రభుత్వ శాఖలు, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమాలు మహిళా సాధికారతను ప్రజా ఉద్యమంగా మార్చాయి. వారోత్సవాల ప్రారంభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఎనిమిది వేల ఇందిరా మహిళా శక్తి భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గ్రామీణ మహిళల సమావేశాలు, శిక్షణలు, జీవనోపాధి కార్యకలాపాలు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు ఈ భవనాలు కేంద్రాలుగా మారనున్నాయి. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనిఫాం చీరలను కూడా ఆవిష్కరించారు. మహిళలను ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక ఇంక్యుబేటర్ కార్యక్రమాలు, రుణ మేళాలు, జీవనోపాధి యూనిట్ల ప్రారంభోత్సవాలు, మార్కెటింగ్ అవకాశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా మధిరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొలి సౌర విద్యుత్ కేంద్రం ప్రారంభం మహిళల సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది. మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్‌లో ఉద్యోగినుల కోసం సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్, సఖి వన్ స్టాప్ సెంటర్‌ను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా చట్టంపై అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించారు.



'బాల్య వివాహం బతుకు ఆగం' నినాదంతో గ్రామ సభలు, ర్యాలీలు, కళాజాతాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహాల నిరోధంపై చైతన్యం కల్పించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణకు ప్రాధాన్యతనిస్తూ 'బలమైన బాల్యానికి 1000 మెట్లు' కార్యక్రమం నిర్వహించగా, అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతానికి రాష్ట్రవ్యాప్తంగా 50 కొత్త అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించి, మరో 27 భవనాలకు శంకుస్థాపనలు చేపట్టారు. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం ద్వారా చిన్నారులకు యూనిఫారాలు, విద్యారంభ ధృవపత్రాలు అందజేయడంతోపాటు అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా అక్షరాస్యత సాధించిన మహిళలను సన్మానించారు. కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్నేహ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మాక్ పార్లమెంట్‌లు, మాక్ అసెంబ్లీలు నిర్వహించారు. జిల్లాస్థాయిల్లో ప్రతిభ కనబరిచిన బాలికలతో హైదరాబాద్ జూబ్లీహాల్‌లో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ అసెంబ్లీ సమావేశాలను తలపించింది. ప్రజా సమస్యలపై చర్చలు, విధానాలపై అభిప్రాయాల వ్యక్తీకరణ, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన ద్వారా బాలికలకు భవిష్యత్ నాయకత్వానికి అవసరమైన పునాది ఏర్పడింది. అలాగే హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈనెల 9న నిర్వహించిన మహిళా శక్తి మహాసభ వారి సాధికారతకు ప్రతీకగా నిలిచింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు తమ ఐక్యత, సంకల్పాన్ని చాటిచెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాలకు కేటాయించిన 553 ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. మహిళలను బస్సుల యజమానులుగా ఎదిగేలా తీసుకొచ్చిన ఈ కార్యక్రమం మహిళా ఆర్థిక సాధికారతలో కీలక మైలురాయిగా నిలిచింది. అదే సభలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల ప్రోత్సాహకాన్ని విడుదల చేయడంతోపాటు బస్సుల అద్దె చార్జీల కింద మండల మహిళా సమాఖ్యలకు రూ.20.34 కోట్ల చెక్కులను అందజేశారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కుటుంబాలకు కలిగిన ఆర్థిక ప్రయోజనాలను ప్రతిబింబించేలా రూ.10,700 కోట్ల ఆదా వివరాలను వెల్లడించారు. మహిళా సంఘాల విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు 'మహిళా ప్రగతి' మాసపత్రికను కూడా ఆవిష్కరించారు.

## షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీస్

హైదరాబాద్, జూన్ 13:
కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ చర్యలకు దిగింది. ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

- రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగం
- ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు
- 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర'లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, జూన్ 13 :
హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాష్ట్రంలో నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చేలా, ఆవిష్కర్తలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ఎకో సిస్టం'ను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలోని యశోదా హాస్పిటల్‌లో రెండ్రోజులపాటు నిర్వహించనున్న 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర'ను ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికీ విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. ముఖ్యంగా వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. అయితే ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో క్యాన్సర్, గుండె జబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందన్నారు. అందుకు హైదరాబాద్‌ను ఒక లాంచ్ ప్యాడ్‌గా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. అకాడెమియా, ఇండస్ట్రీ మధ్య బలమైన అనుసంధానం ఏర్పడినప్పుడే ఏఐ హెల్త్ కేర్ ఆవిష్కరణలు సామాన్యుడికి అందుతాయన్నారు. భవిష్యత్తు సవాళ్లను ముందే ఎదుర్కొనేలా కొత్త ఆలోచనల్ని ప్రోత్సహించే ఇన్నోవేషన్ ఆధారిత వ్యూహాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. ఆవిష్కరణలు కేవలం ల్యాబ్‌లకే పరిమితం కాకుండా సమాజంలో నిజమైన మార్పును తీసుకొచ్చేలా ఆవిష్కర్తలు, స్టార్టప్స్‌కు మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పరిశోధనలకు ఊతమిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్‌ఛేంజ్‌ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్‌లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్‌కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్‌ను సాదరంగా ఆహ్వానించారు.

# వైమానిక దళంలోకి 245 మంది క్యాడెట్లు

మొదటిపేజీ తరువాయి

తెలియజేస్తూ దేశ రక్షణలో వారి పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న 245 మంది క్యాడెట్లకు రాజ్‌నాథ్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. వియత్నాంకు చెందిన విదేశీ క్యాడెట్లను కూడా ప్రత్యేకంగా అభినందించారు. భారత ఎయిర్‌ఫోర్స్ అకాడమీ విదేశీ విద్యార్థులకు సైతం శిక్షణ అందించడం దేశానికి గర్వకారణమని ఆయన అన్నారు.



**ఎయిర్‌ఫోర్స్ చరిత్ర స్ఫూర్తిదాయకం**

భారత వైమానిక దళం చరిత్రను ప్రస్తావిస్తూ 194748లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో ఎయిర్‌ఫోర్స్ కీలక పాత్ర పోషించిందని రాజ్‌నాథ్ సింగ్ గుర్తుచేశారు. అలాగే 1971 యుద్ధంలో కేవలం 13 రోజుల్లోనే విజయాన్ని సాధించడంలో భారత వైమానిక దళం పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. అలాంటి ఘనమైన చరిత్ర కలిగిన దళంలో మీరు అడుగు పెడుతున్నారని క్యాడెట్లకు చెప్పారు.

**ఆధునిక యుద్ధాలకు సిద్ధంగా ఉండాలి**

ప్రస్తుతం యుద్ధాల స్వరూపం పూర్తిగా మారిపోయిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక ఆయుధాలు, రాడార్లకు చిక్కకుండా దాడులు చేసే వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో క్షణాల్లో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం సైనికాధికారులకు ఎంతో అవసరమని చెప్పారు. సరికొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని యువ అధికారులకు సూచించారు.

**ఆపరేషన్ సిందూర్ ఆదర్శం కావాలి**

ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత వైమానిక దళం ప్రదర్శించిన ధైర్యసాహసాలు, తెగువను ఆదర్శంగా తీసుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. దేశ రక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా సమర్థంగా పనిచేసే స్ఫూర్తిని అలవరుచుకోవాలని సూచించారు.

**మహిళల పాత్ర మరింత బలపడుతోంది**

భారత ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కేవలం సైనిక శిక్షణకే పరిమితం కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విదేశాలకు పరిచయం చేయడంలో కూడా కీలక పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. విదేశీ క్యాడెట్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా భారతదేశ ప్రతిష్ఠ మరింత పెరుగుతోందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా భారత వైమానిక దళంలో కమిషన్ పొందబోతున్న మహిళా క్యాడెట్లను రాజ్‌నాథ్ సింగ్ ప్రత్యేకంగా అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఎయిర్‌ఫోర్స్‌లో వారి ప్రవేశం నారీశక్తికి నిదర్శనమని కొనియాడారు. దేశ రక్షణలో మహిళల భాగస్వామ్యం మరింత బలపడుతోందని అన్నారు.

క్యాడెట్లందరూ తమ శిక్షణను దేశ సేవకు అంకితం చేసి భారత వైమానిక దళం గొప్ప సంప్రదాయాలను కొనసాగించాలని రాజ్‌నాథ్ సింగ్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైమానిక దళ ఉన్నతాధికారులు, క్యాడెట్ల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్.. మంత్రి తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

మొదటిపేజీ తరువాయి

తుమ్మల నాగేశ్వరరావు నంబర్ కూడా ఉండటంతో ఆయన స్టేట్‌మెంట్‌ను ఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తు చేస్తున్న 'సిట్' శనివారం రికార్డు చేసింది. 2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు తెలిపారు. మంత్రి ఇంటికి వెళ్లి ఆయన వినియోగించిన నంబర్ చూపి వివరాలు, స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు.

**సిట్ విచారణకు**
**ఎంపీ అనిల్ కుమార్ హాజరు**

ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను 'సిట్' జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో శనివారం సుదీర్ఘంగా విచారించింది. గత ప్రభుత్వ హయాంలో అనిల్ కుమార్ యాదవ్ ఫోన్ ట్యాపింగ్‌కు గురైనట్లు గుర్తించిన పోలీసులు ఇందుకు సంబంధించిన కొన్ని సాంకేతిక ఆధారాలను ఆయన ముందు ఉంచి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. ఏయే రోజుల్లో, ఏ సమయాల్లో ఫోన్ కాల్స్ ట్యాప్ చేశారనే వివరాలను అధికారులు ఆయనకు వివరించినట్లు తెలిసింది. ఇదే కేసులో అనిల్ తండ్రి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైనట్లు సిట్ నిర్ధారించింది. అయితే ఆయన వయోభారం, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా నేరుగా వారి ఇంటికే వెళ్లి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయాలని అధికారులు నిర్ణయించారు. విచారణ అనంతరం ఎంపీ అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్యాపింగ్ వ్యవహారంపై బీఆర్ఎస్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'బీఆర్ఎస్ పార్టీ అత్యంత నీచ రాజకీయాలకు పాల్పడింది.. నా ఫోన్ ట్యాప్ అయినట్లు పోలీసులు గుర్తించి నన్ను విచారణకు పిలిచారు. .ఏ రోజు, ఏ టైమ్‌కు ట్యాపింగ్ జరిగిందో కొన్ని కీలక ఆధారాలను నా ముందు ఉంచి వివరాలు అడిగారు.. అప్పట్లో మా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆదేశాల ప్రకారం పార్టీ కార్యక్రమాలను నిర్వహించేవాళ్లం. అయితే ఏదైనా కార్యక్రమం తలపెట్టి గడప దాటక ముందే తమ ఇంటి ముందు పోలీసులు వాలిపోయేవారు.. మాకు అప్పట్లో అర్థం కాలేదు.. ప్లాన్ చేసుకున్న విషయాలు పోలీసులకు ఎలా తెలుస్తున్నాయా అని ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు 'సిట్' ఆధారాలు చూపిస్తుంటే అసలు విషయం అర్థమైంది' అని చెప్పారు. తన తండ్రి అంజన్ కుమార్ ఫోన్‌ను కూడా ట్యాప్ చేశారని మండిపడ్డారు. ఆయన స్టేట్‌మెంట్ తీసుకోవడానికి అధికారులు ఇంటికి వస్తామని చెప్పారని వెల్లడించారు.

# నలుగురు మావోయిస్టులకు బెయిల్

- **షరతులతో విడుదలకు కృష్ణా జిల్లా కోర్టు అనుమతి**

**విజయవాడ, జూన్ 13:**

మావోయిస్టు కార్యకలాపాల కేసులో అరెస్టైన నలుగురు మావోయిస్టులకు కృష్ణా జిల్లా కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పోడియం రెండు అలియాస్ బీమ, మదకం మదన్ అలియాస్ మాదనన్న, సోది మనీలా, సోది మంగిలకు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి నిందితుడు రూ.25 వేల వ్యక్తిగత పూచీకత్తుతో పాటు ఇద్దరు పూచీకత్తుదారులను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. వారిలో ఒకరు స్థానిక పూచీకత్తుదారు అయి ఉండాలని స్పష్టం చేసింది. అలాగే కోర్టు అనుమతి లేకుండా విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిని దాటి వెళ్లరాదని షరతు విధించింది.

**కానూరులో అరెస్టు**

గత ఏడాది నవంబర్ 18న విజయవాడ కానూరు ఆటోనగర్ ప్రాంతంలో పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఓ భవనంలో ఉన్న ఈ నలుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో నిందితులు 200 రోజులకు పైగా నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. దర్యాప్తు గడువు, చట్టపరమైన అంశాలను ప్రస్తావిస్తూ డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని వారి తరపు న్యాయవాదులు కోర్టును ఆశ్రయించారు.

**వాదనల అనంతరం ఉత్తర్వులు**

ఈ నెల 2న ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. అనంతరం కేసును పరిశీలించిన ధర్మాసనం నిందితుల తరపు వాదనలతో ఏకీభవించింది. ఈ మేరకు నలుగురు మావోయిస్టులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# సింగరేణిపై దృష్టి పెట్టండి

**హైదరాబాద్, జూన్ 13 :**

సింగరేణి సంస్థలో అవకతవకలు, అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ ఇటీవల మీడియాలో కొన్ని కథనాలు, వార్తలు ప్రచురితమయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకొచ్చారు. ఈమేరకు ఆయన ఒక లేఖ రాశారు. అందులోని వివరాలు ఇలా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నడుస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీకి సంబంధించిన ఒక ముఖ్యమైన అంశాన్ని మీ దృష్టికి తీసుకొస్తున్నాను. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సింగరేణి కీలకమైనది. దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి గణనీయమైన పాత్ర పోషిస్తూ దేశ ఇంధన భద్రతకూ విశేషంగా దోహదపడుతోంది. ఇలాంటి సంస్థ నిరంతర అభివృద్ధి, ఆర్థిక స్థిరత్వం అనేవి అత్యంత ప్రాధాన్యమైన అంశాలు. ఈ సందర్భంలో ఇలాంటి అవకతవకలు, అక్రమాలకు సంబంధించిన వార్తల్లోని నిజానిజాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోకపోతే సింగరేణి ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉంది. దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందని, దీనివల్ల సంస్థకు గణనీయమైన ఆర్థిక నష్టం సంభవించినట్లు ఈ పత్రికల కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.51,500 కోట్లకు పైగా బకాయిల కారణంగా సింగరేణి ఆర్థికంగా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ఇలాంటి వార్తలు సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని మరింతగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. వీటిని తక్షణమే పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టకపోతే సింగరేణి ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడటమేకాక సంస్థ భవిష్యత్ అభివృద్ధి, స్థిరత్వానికి కూడా ఆటంకం కలగవచ్చు.. అందువల్ల వాస్తవాలను పరిశీలించి ఆరోపణల్లోని నిజానిజాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతున్నాను. అలాగే సింగరేణి సమర్థవంతమైన నిర్వహణ కోసం తగిన సేఫ్ గార్డ్స్, మెకానిజం, ఇంటర్నల్ కంట్రోల్ సిస్టమ్ సరిగ్గా అమలవుతోందా అనే అంశాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది.. ఈ సమీక్షలో టెక్నాలజీ బేస్డ్ మానిటరింగ్ టూల్స్ వినియోగించడం అవసరమని భావిస్తున్నాను.. అలాగే సమయానుగుణంగా సమీక్షలను నిర్వహించడం ద్వారా లోపాలను ప్రారంభ దశలోనే గుర్తిస్తే వెంటనే పరిష్కరించేందుకు వీలవుతుంది. ఈ ప్రయత్నం ద్వారా వ్యవస్థలో ఉన్న లోటుపాట్లను తొలగించడమే కాక భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా నిరోధించడంతోపాటు సంస్థ సామర్థ్యం, పారదర్శకత, విశ్వసనీయతను మరింత బలోపేతం అవుతుంది.. సంస్థ సజావుగా పనిచేయడంలో సంస్థ కోసం ప్రత్యక్ష్యంగా, పరోక్షంగా పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం విషయంలోనూ మీరు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరుతున్నాను అని ఆ లేఖలో ప్రస్తావించారు.

# గూడెం ఆలయానికి రూ.70 కోట్లతో మహా అభివృద్ధి

- **హామీ ఇచ్చిన 37 రోజుల్లోనే నిధుల మంజూరు**
- **దేవాలయాల అభివృద్ధికి రూ.2,216 కోట్లు ఖర్చు**
- **గోదావరి పుష్కరాలకు రూ.802 కోట్ల కేటాయింపు**
- **రైతులకు అండగా గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు**

**మంచిర్యాల, జూన్ 13:**



దైవభక్తితో పాటు సమాజంలో మార్పు కోసం విద్య, రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయనతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ భూమిపూజ నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పులు సాధ్యమవుతాయని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. గతంలో జరిగిన పిప్పిరి బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

ఆ హామీ ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు విడుదల చేసి భూమిపూజ నిర్వహించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ.70 కోట్ల వ్యయంతో అత్యంత ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

రాష్ట్రంలో ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇప్పటివరకు వివిధ దేవాలయాల అభివృద్ధికి రూ.2,216 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల సరస్వతీ పుష్కరాలను వైభవంగా నిర్వహించామని, రాబోయే గోదావరి పుష్కరాల కోసం రూ.802 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.

దేవాలయాల అభివృద్ధితో పాటు రైతుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం సమానంగా పరిగణిస్తోందన్నారు. గూడెం ప్రాంత రైతులకు సాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు రూ.74 కోట్లతో గూడెం లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక రైతులకు సాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆధ్యాత్మికాభివృద్ధి, రైతు సంక్షేమం, విద్యాభివృద్ధి అనే మూడు ప్రధాన లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీలో గ్రేటర్ టెన్షన్

మొదటిపేజీ తరువాయి

గత మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో ఎదురైన సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ముందుగానే కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. డివిజన్ల వారీగా ఓటర్ల వివరాలు, బూత్‌ల స్థాయిలో పార్టీ బలాబలాలు, గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతంపై విశ్లేషణ జరుగుతోంది.

పార్టీ కోసం పనిచేస్తున్న సర్వే సంస్థలు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో విస్తృతంగా సమాచారం సేకరిస్తున్నట్లు సమాచారం. రిజర్వేషన్లు ఏ వర్గానికి వచ్చినా వెంటనే అభ్యర్థిని ప్రకటించేలా వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకుల వివరాలను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

కొత్త డివిజన్లపై ప్రత్యేక దృష్టి సారించిన బీజేపీ, స్థానిక నాయకత్వ బలాబలాలు, ప్రజాభిప్రాయం, పార్టీ ప్రభావం వంటి అంశాలపై నివేదికలు రూపొందిస్తోంది. సర్వే ఫలితాల ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గ్రేటర్ ఎన్నికల సన్నాహకాలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఇటీవల గ్రేటర్ పరిధిలోని ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశాల్లో ఎన్నికల వ్యూహాలపై చర్చించినట్లు తెలిసింది.

సర్వేల ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తం మీద ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత లేకపోయినా, చివరి నిమిషంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో బీజేపీ గ్రేటర్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# బీజేపీ కుట్రలకు మీనాక్షి బలి

**హైదరాబాద్, జూన్ 13 :**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల మీనాక్షి నటరాజన్ రాజ్యసభకు వేసిన నామినేషన్ తిరస్కరణ విషయంలో బీజేపీ తీరు చూస్తుంటే ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక నియంత దేశంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. శనివారం ఇక్కడ మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ నటరాజన్‌పై కేసు ఏమీ లేదని, నోటీసు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. రాజ్యసభలో బలం పెంచుకోవాలని బీజేపీ కుట్రకు పూనుకున్నదని ఆరోపించారు. గాంధేయవాది, నిజాయతీకి నిలువుటద్దం మీనాక్షి నటరాజన్ అని పీసీసీ చీఫ్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి కార్యాలయం కల్పించుకుని కేసును తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. ప్రధాని నియంతలా వ్యవహరించడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టులో కూడా న్యాయం జరగలేదన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. 24 గంటల్లో ఎన్నికల కమిషన్ స్పందించకపోవడం విచారకరమని అన్నారు. మీనాక్షిని బలి చేశారని, ఆమె విషయంలో కొంతమంది బీజేపీ నేతలు సానుభూతి తెలిపినట్లు తెలిసిందని మహేశ్ అన్నారు. లీకు వీరులు.. గ్రీకు వీరులు ఉంటే సీఎం సమగ్రంగా విచారిస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి తమపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాల్లో విభేదాలు సహజమని, అంతమాత్రాన కుట్రకు పాల్పడరాదని అన్నారు. ఓటు చోరీ చేసి ఇప్పుడు సీటు చోరీ చేశారంటూ వ్యాఖ్యానించారు.

# టీఆర్ఎస్ టైటిల్‌పై ఉత్కంఠ

**హైదరాబాద్, జూన్ 13:**

తెలంగాణ రాజకీయాల్లో కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పార్టీ పేరులో టీఆర్ఎస్ అనే సంక్షిప్త రూపాన్ని వినియోగించడంపై వివాదం చెలరేగడంతో ఆ టైటిల్ కొనసాగుతుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల సంఘం వద్ద పెద్ద ఎత్తున అభ్యంతరాలు నమోదవడంతో ఈ అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.




కొత్త రాజకీయ పార్టీ నమోదులో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరాలు స్వీకరించేందుకు బహిరంగ ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటన అనంతరం తెలంగాణ రక్షణ సేన పేరుపై భారీ సంఖ్యలో ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. సాధారణంగా కొత్త పార్టీల పేర్లపై పరిమిత సంఖ్యలోనే అభ్యంతరాలు వస్తుంటాయి. అయితే ఈ పార్టీ విషయంలో మాత్రం వందల సంఖ్యలో అభ్యంతరాలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కవిత పార్టీ ప్రకటనకు ముందే టీఆర్ఎస్ పేరును తాము కోరామని మహారాష్ట్రలోని షోలాపూర్ కేంద్రంగా పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర సామాజిక సేన ప్రతినిధులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. టీఆర్ఎస్ పేరును తమకే కేటాయించాలని వారు కోరినట్లు సమాచారం.

మరోవైపు బీఆర్ఎస్ కూడా ఈ అంశంపై ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో టీఆర్ఎస్ పేరు ముడిపడి ఉందని, దానికి ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యం ఉందని తమ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఉద్యమ వారసత్వాన్ని ప్రతిబింబించే పేరును మరో రాజకీయ పార్టీ వినియోగించడం సముచితం కాదని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర సంస్థలతో పాటు బీఆర్ఎస్, ఇతర వ్యక్తులు, సంస్థల నుంచి కలిపి దాదాపు 700కు పైగా ఫిర్యాదులు ఎన్నికల సంఘానికి చేరినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో తెలంగాణ రక్షణ సేన పార్టీ పేరు చుట్టూ నెలకొన్న వివాదం మరింత ముదిరింది.

అయితే కవిత అనుచరులు మాత్రం తెలంగాణ రక్షణ సేన పేరుపై ఎలాంటి సమస్య లేదని చెబుతున్నారు. అభ్యంతరాలు కేవలం టీఆర్ఎస్ అనే సంక్షిప్త రూపంపైనే వచ్చాయని, పూర్తి పేరు విషయంలో ఎన్నికల సంఘం సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. తుది నిర్ణయం ఎన్నికల సంఘం చేతుల్లోనే ఉండటంతో రాజకీయ వర్గాల దృష్టి ఇప్పుడు ఆ నిర్ణయంపైనే కేంద్రీకృతమైంది.

# నా ఆస్తులు దోచుకునేందుకు కుట్ర

- **కూటమి నేతలపై కేఏపాల్ సంచలన ఆరోపణలు**

**హైదరాబాద్, జూన్ 13:**

తన చారిటీ సంస్థకు చెందిన ఆస్తులను దోచుకునేందుకు కుట్ర జరుగుతోందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏపాల్ ఆరోపించారు. తాను ప్రపంచ శాంతి కోసం పోరాడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ మాత్రం తన ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

మీడియాతో మాట్లాడుతూ తాను ప్రజా సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని కేఏపాల్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాయాలని చూస్తున్నారని ఆరోపించారు. అయితే ఎలాంటి ఒత్తిళ్లకు తాను లొంగబోనని, అన్యాయానికి వ్యతిరేకంగా తన పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

2014 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ గెలుపు కోసం పగలు, రాత్రి తేడా లేకుండా ప్రచారం చేశానని కేఏపాల్ గుర్తు చేశారు. దేశ ప్రయోజనాల కోసం పనిచేసిన తనకు ఇప్పుడు న్యాయం చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

తన చారిటీ సంస్థ ఆస్తులకు సంబంధించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కేఏపాల్ కోరారు. ఆయన చేసిన ఆరోపణలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



# ఎల్‌నినో కార్యాచరణ ఏదీ?

ఎల్‌నినో హెచ్చరికల నేపథ్యంలో పాలకులు అప్రమత్తం కావాల్సి ఉంది. ముఖ్యంగా సాగు, తాగునీరుతో పాటు, వ్యవసాయ విధానంపై ప్రణాళికలు ఇప్పటికే సిద్ధం కావాల్సి ఉండగా అలాంటిదేమీ కనిపించడం లేదు. ఇప్పుడు దీని ప్రభావంతో భారతదేశానికి కరువు కాలం కమ్ముకొస్తుంది. దీనిపై ప్రజలను రైతులను అప్రమత్తం చేయడంతో పాటు, కార్యాచరణకు సిద్ధం కావాల్సి ఉంది. నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పడతాయి.. వ్యవసాయం బాగుంటుందని ఆశిస్తున్న రైతులకు ఇది అశనిపాతం లాంటిదే. ఎల్ నినో వచ్చేసిందని.. ఈ రుతు పవనాల సమయంలో అది మరింత బలపడుతుందని భాతర వాతావరణ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇదే సమయంలో ఎల్ నినో ప్రారంభం అయినట్లు జపాన్ వాతావరణ సంస్థ జూన్ 11వ తేదీన అధికారికంగా ప్రకటించటం విశేషం. పసిఫిక్ సముద్రం ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగటాన్ని ఎల్ నినో అంటారు. సముద్ర ఉపరితల జలాల ఉష్ణోగ్రత సహజంగా 3.4 డిగ్రీలుగా ఉంటుంది. ఇప్పుడు అది పాయింట్ 5 శాతం పెరిగింది. అంటే సముద్రం నీరు ఉండాల్సిన వేడి కంటే అధిక వేడిగా ఉన్నాయి. దీన్ని ఎల్‌నినో అంటారు. జూన్ నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో ఎల్‌నినో మరింత బలపడుతుందని వాతావరణ శాఖ వెల్లడించింది. జూలై మధ్య నుంచి తూర్పు పసిఫిక్ అంతటా విస్తరిస్తుందని.. ఇదంతా రుతు పవనాల కాలంలోనే జరుగుతుందని వాతావరణ శాఖ నివేదిక స్పష్టం చేస్తుంది. సహజంగా నైరుతి రుతు పవనాల సీజన్ లో చల్లటి వాతావరణంతోపాటు నికరంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ప్రభావంతో సముద్రం నీరు వేడెక్కటం వల్ల సముద్రం నుంచి భూమిపైకి వేడి గాలులు వీస్తాయి. భూమిపై ఎక్కువగా పొడి వాతావరణం ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వం-ర్షపాతం తక్కువగా ఉంటుంది. దీంతో కరువు వస్తుంది. దీనికితోడు అక్కడక్కడ కుండపోత వర్షాలు ఉంటాయి. క్లౌడ్ బరస్టులు ఉంటాయి. దీని వల్ల విపత్తులు వచ్చే ప్రమాదం ఉంది. వర్షాలు తక్కువగా ఉండటం వల్ల నీళ్ల కొరత ఏర్పడుతుంది. మంచి నీళ్లకు.. సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయి. వ్యవసాయానికి అవసరం అయిన నీళ్లు లేక పంటలు పండవు. ఆదాయం లేక రైతులు, రైతు కూలీలకు ఇబ్బంది వస్తుంది. ఎల్‌నినో అధికారంగా ప్రారంభం అయిన భారత వాతావరణ శాఖ ప్రకటనతో ప్రభుత్వాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. రైతులు పంటలు సాగు చేసే విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికి మించి పంటలకు సంబంధించి ఆరుతడి పంటలకు రైతులను ప్రోత్సాహించాలి. సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుంది కాబట్టి, వరి లాంటి పంటలకు రైతులు దూరంగా ఉండాలి. మనకున్న వనరులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా కార్యాచరణ సిద్ధం చేయాలి. ఎల్‌నినోకు కారణం ఓ రకంగా చెప్పాలంటే పర్యావరణ విధ్వంసమే. మన చేజేతులా పర్యావరణ విధ్వంసానికి పాల్పడిన పాపానికి విపరీత వాతావరణ పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం. వాతావరణ మార్పు, పర్యావరణ వ్యవస్థ నష్టం, భూమి ఎడారీకరణ వంటి తీవ్రమైన పరిణామాలతో మానవ-ప్రేరిత పర్యావరణ నష్టం పెరుగుతుంది. పర్యావరణాన్ని పరిరక్షించడం, భూమి మరియు ప్రకృతిని వాటి సహజ స్థితికి పునరుద్ధరించడం ఇప్పుడు అంరి తక్షణ కర్తవ్యం కావాలి. భూమిని రక్షించడానికి, పునరుద్ధరించడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. పర్యావరణ విధ్వంసం నిరంతరంగా సాగడంవ వల్ల మన భూమి భవిష్యత్తు ప్రమాదంలో పడింది. ఎడారీకరణ, భూమి క్షీణత, కరువు అనేది మన కాలంలోని అత్యంత ముఖ్యమైన పర్యావరణ సవాళ్లలో ఒకటి. ఇటీవలే జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నాం. అయినా మనలో మార్పు కానరావడం లేదు. చెరువులను మింగేస్తున్నాం. ప్లాస్టిక్ భూతాన్ని భూమిపైకి వదిలేస్తున్నాం. మన పర్యావరణాన్ని రక్షించడానికి ప్రపంచవ్యాప్త అవగాహన, కార్యాచరణను ప్రోత్సహించడానికి మాటలతో సరిపెడుతున్నాం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పర్యావరణంపై దృష్టి సారించి, ఏటా చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి ఎల్‌నినో ప్రభఆవాలు వచ్చే వచ్చేవి కావు. ఇప్పటికైనా మనమంతా భూమి పునరుద్ధరణ, ఎడారీకరణ, కరువును తట్టుకునే శక్తి, పద్ధతులపై దృష్టి సారించాలి. మన భవిష్యత్తు, మన తరం, భూమి పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు ఆ వైపు కార్యాచరణను రూపొందించి కచ్చితంగా అమలు చేయాలి. పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు, సైన్సు సంస్థలు ఎల్‌నినో దుష్ఫలితాలపై విస్తృతంగా ప్రచారంనిర్వహించాలి. ప్రజలకు అవగాహన కల్పించాలి. ముఖ్యంగా యువతను ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలి. ద ఈ నిని ప్రజా ఉద్యమంగా దిశా నిర్దేశం చేయాలి. అన్ని పర్యావరణ పరిరక్షణ సంస్థలు, వ్యక్తులు ఒక ఉద్యమంలా ఐక్యంగా పనిచేయడం ద్వారా ధరిత్రిని కాపాడుకోవాలి. ఈ క్రమంలో తక్షణంగా ప్రస్తుత విపత్తును తట్టుకునే కార్యాచరణకు రంగం సిద్ధం చేయాలి. కేంద్రం తక్షణమే రాష్ట్రాలతో సంప్రతింపులు జరిపి వ్యయసాయ స ంక్షోభ నివారణకు చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపైనా చర్చించాలి.

# కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

- ఐదురుగు వైమానికి సిబ్బంది మృతిచెందినట్లు సమాచారం



**గౌహతి, జూన్ 13గీ**అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

# మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు

**సోషల్ మీడియా వార్తలను ఖండించిన నెస్లే**




**న్యూఢిల్లీ, జూన్ 13గీ**మ్యాళ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై నెస్లే ఇండియా సంస్థ స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. మ్యాళ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని ఓ నెటిజన్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశంపై చర్చ మొదలైంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఈ ఫిర్యాదుపై దృష్టి సారించి, సంస్థ నుంచి వివరణ కోరింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో నెస్లే స్పష్టం చేసింది. మ్యాళ నూడుల్స్‌పై ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చాయని నెస్లే ఇండియా స్పష్టం చేసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి నమూనా పంపించాలని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనా రాలేదని తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తి నమూనాను పరిశీలించే అవకాశం లభించలేదని పేర్కొంది. ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్టు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు కనిపించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి అనుగుణంగా ఉందని రిపోర్ట్ వచ్చినట్టు కంపెనీ పేర్కొంది. వినియోగదారుల భద్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడబోమని కంపెనీ మరోసారి స్పష్టం చేసింది.



# ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

**విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, జూన్ 13గీ**భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

# తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

**సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్.. ■ టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక**

**న్యూఢిల్లీ, జూన్ 13గీ**తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కోసులో అభిషేక్ తరఫున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపిరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలను కుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదలని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

# తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

**కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**న్యూఢిల్లీ, జూన్ 13గీ**ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయ-ంబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.



# ఆరోగ్యరంగ భవిష్యత్తుకు ఏఐ కొత్త దిశ






- **యశోద హాస్పిటల్స్‌లో 'ఏఐ ఇన్ హెల్త్ కేర్ 2.0' అంతర్జాతీయ సదస్సు ప్రారంభం**

**హైదరాబాద్, జూన్ 13:**

ఆరోగ్యరంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, ఆవిష్కరణలు, భవిష్యత్ అవకాశాలపై చర్చించేందుకు యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో నిర్వహిస్తున్న "ఏఐ ఇన్ హెల్త్ కేర్ 2.0" అంతర్జాతీయ వైద్య విజ్ఞాన సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు కలిసి ఈ సదస్సును ప్రారంభించారు. జూన్ 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో 2,000 మందికి పైగా వైద్యులు, ఆరోగ్య నిపుణులు, పరిశోధకులు, ఏఐ సాంకేతిక నిపుణులు పాల్గొంటున్నారు. "పవరింగ్ ప్రెసిషన్ అండ్ పర్సనలైజింగ్ కేర్" అనే అంశంపై జరుగుతున్న ఈ సదస్సులో ప్రెసిషన్ మెడిసిన్, ఏఐ ఆధారిత డయాగ్నస్టిక్స్, డిజిటల్ పాథాలజీ, రోబోటిక్ సర్జరీ, డ్రగ్ డిస్కవరీ, క్లినికల్ ఏఐ అప్లికేషన్స్ తదితర అంశాలపై నిపుణులు చర్చించనున్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐఐఐటీ హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్, ఐఎస్‌బీ, నోవార్టిస్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, కింగ్స్ కాలేజ్ లండన్, మెడ్ట్రానిక్, టీసీఎస్ వంటి ప్రముఖ సంస్థల నిపుణులు తమ అనుభవాలు, పరిశోధన ఫలితాలు పంచుకోనున్నారు. పాలసీ పావిలియన్, స్టార్టప్ ఇన్నోవేషన్ సెషన్లు సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, ఏఐ ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని, ఆరోగ్యరంగం కూడా కీలక పరివర్తన దశలో ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏఐ, డిజిటల్ ఇన్నోవేషన్, డీప్‌టెక్ రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. డాక్టర్ జి.ఎస్.రావు మాట్లాడుతూ, ఏఐ వినియోగం వైద్య సేవల నాణ్యత, వేగం, ఖచ్చితత్వాన్ని పెంచుతోందన్నారు. వ్యాధులను ముందుగానే గుర్తించడం, క్లిష్టమైన కేసుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు అందించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. సదస్సు ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, యశోద హాస్పిటల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ చినబాబు సుంకవల్లి మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు ఆరోగ్యరంగ భవిష్యత్తును పునర్నిర్వచిస్తున్న పరివర్తనాత్మక శక్తి అని అన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ హెల్త్‌టెక్ హబ్‌గా బలోపేతం చేసే దిశగా ఈ సదస్సు కీలక ముందడుగని తెలిపారు.

## లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్‌ను తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్





**హైదరాబాద్, జూన్ 13:**

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్‌ను సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. వీల్ షాప్, డీవీ ఓవర్‌హాల్ విభాగం, ఎయిర్ బ్రేక్ షాప్, పెయింట్ షాప్, స్ప్రింగ్ షాప్‌ల పనితీరును పరిశీలించారు. అలాగే ఎల్‌హెచ్‌బీ వర్క్ స్టేషన్, డైనమిక్ వీల్ బ్యాలెన్సింగ్ యంత్రం, షాక్ అబ్జార్బర్ టెస్టింగ్ యంత్రం, ఆప్టికల్ ఎమిషన్ స్పెక్ట్రోమీటర్, యూనివర్సల్ టెస్టింగ్ మెషిన్ వంటి ఆధునిక సదుపాయాలను తనిఖీ చేశారు. వర్క్‌షాప్‌లో నిర్వహిస్తున్న పనుల నాణ్యతను, ఆధునిక సాంకేతికత వినియోగాన్ని ఆయన అభినందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్క్రాప్ రహిత యూనిట్‌గా నిర్వహిస్తున్నందుకు అధికారులు, సిబ్బందిని ప్రశంసించారు. భారతీయ రైల్వేల్లో లాలాగూడ వర్క్‌షాప్‌ను ప్రముఖ కోచ్ నిర్వహణ కేంద్రంగా నిలిపిన ఘనత ఉద్యోగులదేనని పేర్కొన్నారు.

# పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూన్ 13:**

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం లక్షెట్టిపేటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు.



ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభానికే పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేయాలని, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మం బాధితురాలిని పరామర్శించిన కవిత

**హైదరాబాద్ జూన్13 :**

హైదరాబాద్: నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం అత్యాచారయత్నం బాధిత బాలికను తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

ఖమ్మం ఘటనలో నిందితుడికి ఉరిశిక్ష విధించాలని, బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, ఇల్లు, భద్రత కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మైనర్లపై పెరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

# రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

- **ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం.. లైబ్రరీకి రూ.10 లక్షల మంజూరు**
- **జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఆదిలాబాద్, జూన్ 13:**

ఆదివాసీల ఆచార సంప్రదాయాలు దేశానికి ఆదర్శమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో శనివారం పర్యటించిన మంత్రి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించి లబ్ధిదారులను అభినందించారు.రిమ్మ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటికే 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణంతో పాటు గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు అందిస్తామని స్పష్టం చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## తెలంగాణలో ఉరుములు, ఈదురుగాలుల తో వర్షా లు

**హైదరాబాద్, జూన్ 13:**

భారత వాతావరణ శాఖ (IMD) హైదరాబాద్ కేంద్రం తెలంగాణలోని పలు జిల్లాలకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షాలు మరియు గంటకు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని హెచ్చరిక జారీ చేసింది. తదుపరి మూడు గంటల్లో హైదరాబాద్, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, మెదక్, మేడ్చల్–మల్కాజిగిరి, నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈ వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెట్ల కింద నిలబడకూడదని, మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచించారు.

## షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసు

**హైదరాబాద్: జూన్13:**

కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ వ్యాఖ్యలపై ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా స్పందించినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ను ఉద్దేశించి ఆయన చేసినట్లు చెబుతున్న ఆరోపణల ఆడియో వైరల్ కావడంతో పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ ముఖ్యులు డబ్బులు ఇచ్చేవారికి, ప్రభావం చూపేవారికి అమ్ముడవుతున్నారంటూ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. మహిళలను కించపరిచే విధంగా ఆరోపణలు చేసిన అంశాన్నీ పార్టీ పెద్దలు తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే షబ్బీర్ అలీ కూడా తన వైఖరిలో దృఢంగానే ఉన్నట్లు సమాచారం. ఈ వివాదం ఏ మలుపు తీసుకుంటుందో చూడాలి.

## తెలంగాణ రైతులకు ముఖ్య సూచన

**హైదరాబాద్ జూన్13:**

దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరిస్తున్న నేపథ్యంలో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ప్రారంభమైనట్లు ఐఎండీ తెలిపింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం, కొన్ని ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రైతులు పంటల సాగు విషయంలో వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఆధారం:** తాజా నివేదికల ప్రకారం ఐఎండీ ఎల్‌నినో పరిస్థితులు రుతుపవనాల కాలంలో బలపడే అవకాశం ఉందని తెలిపింది.

## అక్రమ లింగ నిర్ధారణ రాకెట్ భగ్నం.. ముగ్గురు అరెస్ట్

**హైదరాబాద్ జూన్13:**

ఎల్బీనగర్ పరిధిలోని వనస్థలిపురం పోలీసులు అక్రమ లింగ నిర్ధారణ రాకెట్‌ను ఛేదించారు. హయగ్రీవ హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు డికాయ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కేసులో హాస్పిటల్ డైరెక్టర్ కొర్ర రాజు, రిసెప్షనిస్ట్ లోకేష్, తుక్కుగూడలోని శ్రీ సాయి ధనుష్ క్లినిక్ ల్యాబ్ టెక్నీషియన్ విజయ్ కుమార్‌ను అరెస్ట్ చేసి PCPNDT చట్టం కింద కేసు నమోదు చేశారు. గర్భంలోని శిశువు ఆడా, మగా అనే వివరాలు చెబుతామని నిందితులు హామీ ఇచ్చి, స్కానింగ్ కోసం రిఫర్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం తుక్కుగూడలోని క్లినిక్‌పై దాడి చేసి విజయ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. అయితే హాస్పిటల్‌ను సీజ్ చేయకుండా, డాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం కేసు నమోదు చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తూ, అక్రమ లింగ నిర్ధారణలపై సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నల్లగొండలో రాష్ట్ర సిట్రస్ సెమినార్-2026 ప్రారంభం



**నల్గొండ జూన్13:**

నల్లగొండలో నిర్వహిస్తున్న రాష్ట్ర సిట్రస్ సెమినార్–2026ను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్లగొండ బత్తాయి సాగుకు పెట్టింది పేరని, వేలాది మంది రైతుల జీవనాధారం సిట్రస్ పంటలేనని అన్నారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తిగా రైతుల కష్టాలు తనకు తెలుసని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని, సిట్రస్ రైతుల సమస్యల పరిష్కారం, ఆధునిక సాగు పద్ధతులు, మార్కెటింగ్, ఎగుమతి అవకాశాలపై ఈ సదస్సు ఉపయోగపడుతుందని తెలిపారు. "రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుంది.. గ్రామం బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అని మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణ సీఈఓను కలిసిన అసదుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్, జూన్ 13:**

ఏఐఎంఐఎం అధ్యక్షుడు, బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని కలిశారు. జూన్ 25 నుంచి జూలై 24, 2026 వరకు నిర్వహించనున్న ఎస్ఐఆర్ ఇంటింటి ఓటరు లెక్కింపు కార్యక్రమంపై పలు కీలక అంశాలను ప్రస్తావిస్తూ వినతిపత్రం సమర్పించారు. ఓటర్ల వివరాల పరిశీలన పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని ఒవైసీ కోరారు. ఇంటింటి సర్వే సమయంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వడం, బూత్ స్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వడం అవసరమని పేర్కొన్నారు.

చురకలు

ఆదివారం 14 జూన్ 2026

# నిజామాబాద్ జిల్లాలో యాప్ ద్వారా యూరియా పంపిణీ

**నిజామాబాద్, జూన్ 13:**

నిజామాబాద్ జిల్లాలో రైతులకు యూరియా పంపిణీని ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా చేపడుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 1,29,824 మంది రైతులు 3,55,795 బస్తాల యూరియాను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 23 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండేలా, పంటలకు శాస్త్రీయ పద్ధతిలో నత్రజని అందేలా ఈ యాప్‌ను రూపొందించినట్లు చెప్పారు. యాప్ వినియోగంలో ఏవైనా సమస్యలు ఎదురైతే వ్యవసాయ విస్తరణాధికారి, మండల వ్యవసాయ అధికారి, సొసైటీ అధికారులు లేదా వాలంటీర్లను సంప్రదించి యూరియా బుకింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. యూరియా దొరకదనే ఆందోళన అవసరం లేదని, పంటలకు సరిపడా యూరియా అందించే బాధ్యత వ్యవసాయ శాఖ తీసుకుంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి స్పష్టం చేశారు.

# కార్మికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

**ఆలేరు, జూన్ 13:**

ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలోని పిఎసిఎస్ కొనుగోలు కేంద్రం వద్ద పనిచేస్తున్న హమాలి కార్మికులకు మాజీ ఎన్ పి ఎం ఆదర్శ రైతు కొంతం సిద్ధార్థ మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గాదుల నరసయ్య మాట్లాడుతూ, ఎండాకాలంలో కష్టపడి పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ సెల్ నాయకులు కటికే వెంకటేష్, బాలస్వామి, అమాలి కార్మిక సంఘం అధ్యక్షుడు ఆళ్ల సత్తయ్య, గాజుల ఆంజనేయులు, కర్ణాకర్, పరమేష్, చంద్రయ్య, దార రాములు, సలేంద్రి కిష్టయ్య, సలేంద్రి శంకరయ్యలు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మోహనన్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు



**ఆలేరు, జూన్ 13:**

నూతన ప్రజాస్వామిక విప్లవమే ప్రజలను అన్ని రకాల దోపిడీ, పీడనల నుంచి విముక్తి చేస్తుందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాచకొండ జనార్ధన్ అన్నారు. యాదగిరిగుట్ట మండలం కమటం గూడెంలో శనివారం అమరుడు కామ్రేడ్ ఏనుగుల మోహనన్న 11వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన స్మారక స్థూపం వద్ద ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి జెండా ఆవిష్కరించగా, కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా విముక్తి మార్గంలో చివరి వరకు నిబద్ధతతో పనిచేసిన మోహనన్న ప్రతి విప్లవ కార్యకర్తకు ఆదర్శమని జనార్ధన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇక్కిరి సహదేవ్, మామిడాల సోమయ్య, కల్లెపు అడివయ్య, ఆర్. సీత, సుంకె సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి స్టేషన్‌లో జూన్ 15 నుంచి యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థ



**హైదరాబాద్, జూన్ 13:**

చర్లపల్లి రైల్వే స్టేషన్ దక్షిణ టెర్మినల్ (ప్లాట్‌ఫాం నెం.9 వైపు) వద్ద ప్రయాణికుల రాకపోకలు, వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు దక్షిణ మధ్య రైల్వే జూన్ 15 అర్ధరాత్రి నుంచి యాక్సెస్ కంట్రోల్ వ్యవస్థను అమలు చేయనుంది. ఈ విధానంలో ప్రయాణికులను దింపడం, తీసుకెళ్లడం కోసం వచ్చే ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు తొలి 20 నిమిషాలు ఉచితంగా అనుమతి ఉంటుంది. అనంతరం 20–30 నిమిషాలకు ₹50, 30–45 నిమిషాలకు ₹100, 45–60 నిమిషాలకు ₹200, గంట దాటితే ₹500 రుసుము వసూలు చేయనున్నారు. నిర్దేశిత పార్కింగ్ ప్రాంతంలో నాలుగు చక్రాల వాహనాలకు తొలి రెండు గంటలకు ₹20, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు ₹15 రుసుము ఉండగా, ఆ తర్వాత ప్రతి అదనపు గంటకు ₹10 చొప్పున వసూలు చేస్తారు. డిజిటల్ టికెటింగ్, డిజిటల్ రసీదులు, ప్రత్యేక పిక్‌అప్–డ్రాప్ లేన్ల ఏర్పాటు ద్వారా ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని రైల్వే అధికారులు తెలిపారు.

**ప్రత్యామ్నాయ శీర్షికలు:**

**చర్లపల్లి స్టేషన్ లో కొత్త ట్రాఫిక్ నియంత్రణ విధానం**

**జూన్ 15 నుంచి చర్లపల్లిలో పిక్ అప్–డ్రాప్ కు కొత్త నిబంధనలు**

**చర్లపల్లి టెర్మినల్ వద్ద యాక్సెస్ కంట్రోల్ అమలు**

**వాహనాల రద్దీ నియంత్రణకు రైల్వే కొత్త చర్యలు**

**చర్లపల్లి స్టేషన్ లో డిజిటల్ యాక్సెస్ వ్యవస్థ ప్రారంభం**

# ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- **అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం.**
- **ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు**
- **మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట, జూన్,13**




ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు.ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ తెలిపారు.

# మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ తీరు అప్రజాస్వామికం

**మహేష్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్, జూన్ 13:**

మీనాక్షి నటరాజన్ విషయంలో బీజేపీ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గాంధీ భవన్ లో ఆయన మాట్లాడుతూ.. కేసు, ఎఫ్ ఐఆర్ లేకుండానే నోటీసుల పేరుతో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. రాజ్యసభలో బలం పెంచుకునేందుకు కుట్రపూరితంగా వ్యవహరించారని, ప్రధాని కార్యాలయం జోక్యంతో ఈ వ్యవహారాన్ని తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. గాంధేయవాది అయిన మీనాక్షి నటరాజన్ ను బలి చేశారని, ఎన్నికల సంఘం 24 గంటల్లో స్పందించకపోవడం విచారకరమన్నారు. బీజేపీ ఫాసిస్టు విధానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కి కాంగ్రెస్ పై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. "ఓటు చోరీ చేసి.. ఇప్పుడు సీటు చోరీ చేశారు" అని వ్యాఖ్యానించారు. షబ్బీర్ అలీ ఆరోపణలపై తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదని, తన ఆస్తులు, వ్యక్తిత్వం నిజామాబాద్ ప్రజలకు తెలుసన్నారు. షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసు ఇచ్చామని తెలిపారు. మహిళలను చులకనగా మాట్లాడటం విచారకరమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

# హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్

**మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్ జూన్13:**




హైదరాబాద్‌ను హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్‌కు ప్రపంచస్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శనివారం హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో జరిగిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఏఐ ఇన్ హెల్త్ కేర్'ను ఆయన ప్రారంభించారు.ఏఐ వైద్య రంగాన్ని వ్యాధి నిర్ధారణ దశ నుంచి రాబోయే ముప్పును ముందే అంచనా వేసే స్థాయికి తీసుకెళ్లిందని మంత్రి తెలిపారు. అయితే ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదని, సాంకేతికతకు మానవీయ విలువలు జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగు తుందని స్పష్టం చేశారు.క్యాన్సర్, గుండెజబ్బులు వంటి ఆరోగ్య సవాళ్లకు కొత్త పరిష్కారాలు అవసరమని, అందుకు హైదరాబాద్‌ను లాంచ్‌ప్యాడ్‌గా తీర్చిది ద్దుతున్నామని చెప్పారు. ఏఐ ఆధారిత డేటా ఎక్స్ఛేంజ్, 'వన్ బయో', స్టార్టప్స్‌కు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్' వంటి చర్యలతో ప్రభుత్వం ఆవిష్కరణలకు అండగా నిలుస్తోందని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

# కాంగ్రెస్ తనను మోసం చేసిందన్న జీవన్ రెడ్డి

**కాళేశ్వరం మరమ్మతుల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శ**

**హైదరాబాద్, జూన్ 13:**



కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తనను మోసం చేసిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో తన చెమట, కృషి ఉందని, అలాంటి తననే పార్టీ నాయకత్వం పక్కన పెట్టిందని అన్నారు. తెలంగాణ సాధనలో నిధులు, నీళ్లు, నియామకాల లక్ష్యాలను నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే గర్వకారణమని, సాగునీటి సదుపాయాలతో రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందిందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంగిన పియర్ల మరమ్మతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మరమ్మతులు చేపట్టేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ ముందుకు వచ్చినప్పటికీ, కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగీకరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే బాధ్యత వహించాలని జీవన్ రెడ్డి అన్నారు. మాటల గారడీతోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. రైతు భరోసా కింద రైతులకు రావాల్సిన రూ.6 వేల సాయం అందకుండా చేసిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. తెలంగాణ యువత ప్రస్తుతం కేటీఆర్ వైపు ఆశగా చూస్తోందని పేర్కొన్న ఆయన, కేసీఆర్ ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. ప్రజాపాలన పేరుతో ప్రజావంచన చేస్తున్నది రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వమేనని జీవన్ రెడ్డి ఆరోపించారు.

# కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి

- **యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి..**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**
- **పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవనం పరిశీలన..**

**కరీంనగర్, జూన్ 13:**



కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు–భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చురకలు

ఆదివారం 14 జూన్ 2026

# జీడిమెట్లలో 7 మంది బంగ్లాదేశ్ జాతీయుల అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 13(సమయం న్యూస్).**



జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నివసిస్తున్న ఏడుగురు బంగ్లాదేశ్ జాతీయులను పోలీసులు అరెస్ట్ చేశారు. గజులరామారం–జీడిమెట్ల ప్రాంతంలోని హెచ్ఏఎల్ ఏరియాలో అద్దె ఇంట్లో వారు నివసిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు సోదాలు నిర్వహించారు. విచారణలో వారి వద్ద భారతదేశంలో ఉండేందుకు అవసరమైన చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర ప్రయాణ పత్రాలు లేవని తేలింది. వారు అక్రమంగా దేశంలోకి ప్రవేశించి వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. కుత్బుల్లాపూర్ జోన్ డీసీపీ, ఐపీఎస్ అధికారి ఎన్. కోటి రెడ్డి ఆదేశాల మేరకు వారిని అదుపులోకి తీసుకుని, మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ సెంటర్‌కు తరలిస్తున్నారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి అనంతరం వారిని బంగ్లాదేశ్‌కు బహిష్కరించనున్నారు.

# వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- **విద్యార్థుల భద్రత, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నిజామాబాద్, జూన్ 13( సమయం న్యూస్)**




ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించి వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వసతి గృహాలు, విద్యా సంస్థల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, వర్షాకాలంలో దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, ప్రతి హాస్టల్‌లో డైట్ మెనూ పట్టికను ప్రదర్శించాలని చెప్పారు. తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు సహా అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల అవసరాలపై ఈ నెల 20లోపు వివరాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, లోపాలు బయటపడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి. భుజంగరావు, డీఎస్సీడీఓ రజిత, జిల్లా విద్యాశాఖ అధికారి పి. అశోక్, సంబంధిత శాఖల అధికారులు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# నిసా హైదరాబాద్‌లో సీఐఎస్ఎఫ్ దీక్షాంత్ పరేడ్






**200 మంది అధికారుల చేరిక**

**హైదరాబాద్, జూన్ 13:**

హకీంపేటలోని నిసా అకాడమీలో సీఐఎస్ఎఫ్ 39వ బ్యాచ్ అసిస్టెంట్ కమాండెంట్లు, 19వ బ్యాచ్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు (మాజీ సైనికులు) దీక్షాంత్ పరేడ్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా 200 మంది అధికారులు సీఐఎస్ఎఫ్‌లో చేరారు. తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల(Shiv Pratap Shukla )ముఖ్య అతిథిగా హాజరుకాగా, సీఐఎస్ఎఫ్ డీజీ Praveer Ranjan పాల్గొన్నారు. శిక్షణ పూర్తిచేసిన వారిలో 76 మంది అసిస్టెంట్ కమాండెంట్లు, 124 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ సుమిత్ లాథ్వాల్ 'స్వోర్డ్ ఆఫ్ హానర్' అందుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావంతో విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా 359కు పైగా కీలక సంస్థలకు భద్రత కల్పిస్తోందని, ఆధునిక సాంకేతికత, సైబర్ భద్రత, కౌంటర్ డ్రోన్ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీజీ ప్రవీర్ రంజన్ తెలిపారు.

# జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ జూమ్ మీటింగ్

- **తాగునీరు, సీవరేజ్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని అశోక్ రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్ జూన్13( సమయం న్యూస్).**

నగరంలో ఎలాంటి తాగునీరు, సీవరేజ్ ఇబ్బందులు లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. నెలవారీ నిర్వహించే ఈ మీటింగ్ లో పలు కీలక సూచనలు, ఆదేశాలిచ్చారు. నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా వాటర్ లీకేజీలు, సివరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అన్ని ముఖ్య ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలు పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎంసీసీ పిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కలుషితనీరు సమస్యలను పరిష్కరించడానికి ప్రాముఖ్యతనివ్వాలి సూచించారు. పగటి పూట ప్రధాన రహదారుల్లో ఏదైనా సమస్యలు పరిష్కరానికి చేపట్టే మరమ్మతులతో ట్రాఫిక్ ఆటంకం కాకుండా.. రాత్రిపూట పనులను చేపట్టాలని సూచించారు.

# భారీ వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం

**అధికారులకు హై అలర్ట్ ఆదేశాలు**

**హైదరాబాద్, జూన్ 13:(సమయం న్యూస్)**

రాష్ట్రంలో భారీ వర్షాల సూచనల నేపథ్యంలో ముఖ్యమంత్రి A. Revanth Reddy అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (CURE) పరిధిలోని అన్ని శాఖలు హై అలర్ట్‌లో ఉండాలని ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డు తదితర శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, CURE స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వర్షాల అంచనాల ఆధారంగా నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా సిబ్బంది, సహాయక బృందాలను మోహరించాలని, నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు.

# వంటేరును ఆశీర్వదించిన కేసీఆర్

**సమయం న్యూస్ గజ్వేల్ జూన్ 13**



గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మాజీ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదినం సంద ర్భంగా తెలంగాణ మాజీ ముఖ్య మంత్రివర్యులు గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వా దాలు తీసుకోవడం జరిగింది వంటేరు ప్రతాప్ రెడ్డి వెంట ప్రతాప్ రెడ్డి కుమారుడు యువ నేత వంటేరు విజయవర్ధన్ రెడ్డి ఉన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల ఎస్టిమేషన్లు నెలాఖరులోగా పూర్తి చేయాలి:

**అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**

**మహబూబ్‌నగర్, జూన్ 13:( సమయం న్యూస్).**

ఇందిరమ్మ ఇళ్ల మెటీరియల్ కాంపోనెంట్ ఎస్టిమేషన్ తయారీ, గృహ ప్రతిపాదనల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన 90 రోజుల్లోపు ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మంజూరైన 5,972 ఇళ్లలో 3,493 ఇళ్లకు ఎన్ఆర్ఈజీఎస్ కింద చెల్లింపుల కోసం మస్టర్లు సమర్పించగా, మిగిలిన 2,478 ఇళ్ల ఎస్టిమేషన్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో, డీఆర్డీఓ, హౌసింగ్ పీడీ, ఎంపీడీవోలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జూన్ 13:(సమయం న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం లక్షెట్టిపేటలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన భోజనశాల, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు అన్ని పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభానికే పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందజేయాలని, బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సిఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీ బదిలీలు

**హైదరాబాద్, జూన్ 13( సమయం న్యూస్)**

ఎం సి టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీ స్థాయిలో బదిలీలు జరిగాయి. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న అధికారులతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులను కూడా స్థానచలనం చేశారు. కొన్ని చోట్ల ఖాళీల కారణంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఏసీపీలకు రెండు సర్కిళ్ల బాధ్యతలను అదనంగా అప్పగించినట్లు సమాచారం.

**బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి**

నార్సింగిలో ఏసీపీగా పనిచేస్తున్న మనోహర్‌ను వనపర్తికి బదిలీ చేశారు. అమీన్‌పూర్ ఏసీపీ పవన్‌ను తాండూర్‌కు బదిలీ చేశారు. కొంపల్లిలో ఏసీపీగా ఉన్న వాణిని వికారాబాద్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. మేడ్చల్‌లో పనిచేస్తున్న సుకన్యను నల్గొండ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. నార్సింగిలో టీపీఎస్‌గా ఉన్న మౌనికను తాండూర్ మున్సిపాలిటీకి బదిలీ చేశారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పరిపాలనా అవసరాలు, సేవల మెరుగుదల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# ఏజాజ్ కు నాయకుల పరామర్



**ఆలేరు, జూన్ 13(సమయం న్యూస్):**

ఇటీవల అనారోగ్యానికి గురైన ఆలేరు మున్సిపల్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఏ ఎజాస్‌ను ఆలేరు మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు పరామర్శించారు. శనివారం ఎజాజ్ నివాసంలో కలుసుకున్న వారు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజా సేవలో తిరిగి పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయనను కలుసుకున్న సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల శ్రీకాంత్, వట్టిపల్లి శ్రీనివాస్, పర్శ నరేష్ తదితరులున్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: కోస్గి సీఐ సైదులు

**కోస్గి,మద్దూరు, మున్సిపాలిటీ, జూన్,13(సమయం న్యూస్)**



కోస్గి సర్కిల్ పరిధిలోనీ కోస్గీ, మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా కాలంగా కోర్టులో పెండిగ్‌లో వున్న కేసుల పరిష్కారం కోసం కోస్గి కోర్టులో కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోస్గి సీఐ సైదులు ఒక ప్రకటనలో ప్రజలకు తెలిపారు.ఈ నెల 20వ తేది వరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో కోస్గి, నారాయణపేట కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించబడును. ఈ లోక్ అదాలత్ ద్వారా చట్టరీత్యా రాజీకి అర్హమైన క్రిమినల్ కేసులతో పాటు రాజీపడదగిన సివిల్ కేసులు, భూ వివాదాలు, వాహన ప్రమాద పరిహార కేసులు, చిట్‌ఫండ్ కేసులు, చెక్‌బౌన్స్‌కేసులు, వైవాహిక కేసులు, తగాదాలు, అన్ని రకాల ట్రాఫిక్ కేసులకు సంబంధించి జాతీయ లోక్ అదాలత్‌నందు ఇరువర్గాల కక్షీదారులు అంగీకారయోగ్యమైన సత్వర పరిష్కారం ఈ లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని. ఇరువర్గాల కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని. లోక్ అదాలత్ ద్వారా రాజి కుదుర్చుకుంటేనే రాజమార్గమని తెలిపి మరిన్ని వివరాలను లోకల్ పోలీస్ స్టేషన్ అధికారులను సంప్రదించాల్సిందిగా సిఐ తెలిపారు.

# శనగ రైతులకు రూ.69.06 కోట్ల చెల్లింపులు పూర్తి

**ఆదిలాబాద్, జూన్ 13( సమయం న్యూస్)**

యాసంగి 2025–26 సీజన్‌లో మద్దతు ధరకు శనగలను విక్రయించిన రైతులకు రూ.69.06 కోట్ల చెల్లింపులు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. జిల్లాలో 10 కొనుగోలు కేంద్రాల ద్వారా 5,813 మంది రైతుల నుంచి క్వింటాల్‌కు రూ.5,875 చొప్పున మొత్తం 1.18 లక్షల క్వింటాళ్ల శనగలను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.69.33 కోట్ల విలువైన శనగ కొనుగోళ్లకు సంబంధించి తొలి విడతలో రూ.64.12 కోట్లు, రెండో విడతలో రూ.5.19 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. మిగిలిన స్వల్ప బకాయిలు రూ.2.67 లక్షలు కూడా త్వరలో విడుదలై రైతులకు చెల్లిస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

# రియాక్టర్ లీక్‌తో ఎంఎస్ఎన్ ఫార్మాలో కలకలం

- ఇద్దరు కార్మికులకు గాయాలు.. సైరన్ మోగడంతో పరుగులు తీసిన సిబ్బంది!
- భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు.. పాత రియాక్టర్ల మార్పిడి కోరుతున్న కార్మికులు.


చికిత్స పొందుతున్న వ్యక్తి

**కామారెడ్డి, జూన్ 13:**

బిక్కనూరు మండల పరిధిలోని ఎంఎస్ఎన్ ఫార్మా పరిశ్రమలో శుక్రవారం రియాక్టర్ లీక్ ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడగా, ఫ్యాక్టరీలో పనిచేస్తున్న పలువురు కార్మికులు భయాందోళనకు గురయ్యారు.కాచాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి కిషన్‌తో పాటు మరో కార్మికుడు విధులు నిర్వహిస్తున్న సమయంలో రియాక్టర్ నుంచి గ్యాస్ లీక్ అయినట్లు సమాచారం. లీకేజీ అనంతరం మంటలు వ్యాపించడంతో అత్యవసర సైరన్ మోగించారు. దీంతో పరిశ్రమలోని కార్మికులు ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు.ప్రమాదంలో గాయ పడిన ఇద్దరు కార్మికులను యాజ మాన్యం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా, ఫ్యాక్టరీలోని కొన్ని రియాక్టర్ల పరిస్థితిపై గతంలోనే యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. రియాక్టర్లలో తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతున్నాయని, వాటిని నిర్లక్ష్యం చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు. ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు అత్యంత కీలకమని, ప్రమాదకర రసాయనాలతో పనిచేసే యూనిట్లలో పరికరాల తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందని కార్మికులు చెబుతున్నారు. గ్యాస్ లీకేజీ గుర్తింపు వ్యవస్థలు, అగ్నిమాపక భద్రతా పరికరాలు, అత్యవసర స్పందన వ్యవస్థలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయా అనే అంశంపై సంబంధిత శాఖలు పరిశీలించాలని వారు కోరుతున్నారు. గతంలో కూడా ఈ పరిశ్రమ వల్ల కాలుష్య సమస్యలు తలెత్తుతున్నాయని పరిసర గ్రామాల ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తాజా ఘటనతో కార్మికుల భద్రత మరోసారి చర్చనీ యాంశంగా మారింది. పాతబడిన రియాక్టర్ల స్థానంలో కొత్త పరికరాలు ఏర్పాటు చేసి, భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు.

# లహరి గ్రీన్ పార్క్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

- ప్రజలకు మెరుగైన రోడ్లు అందిస్తాం:ఎమ్మెల్యే వివేకానంద్
- బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేగంగా అభివృద్ధి పనులు

**కుత్బుల్లాపూర్, జూన్ 13 :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట లహరి గ్రీన్ పార్క్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా, వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత 12 ఏళ్లుగా కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ప్రతి కాలనీ, ప్రతి ప్రాంతంలో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సునీతా మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తెర అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెలగపూడి శ్రీనివాస్,



ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, సభ్యులు మురళి, ప్రశాంత్, కాటం శ్రీనివాస్, నాయకులు ఎస్వీ సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆదుకోండి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన సీపీఎం నేతలు

**మేడ్చల్, జూన్ 13 :**

మేడ్చల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆసుపత్రిని సందర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ. అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడం వల్లే రోగుల సంఖ్య తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. బదిలీల కారణంగా ఖాళీ అయిన వైద్యుల పోస్టులను భర్తీ చేయకపోవడం సమస్యకు ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి రావాలంటేనే భయపడే పరిస్థితులను ప్రభుత్వం




కల్పిస్తోందని, వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు.

**నత్తనడకన 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణం**

సీపీఎం మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని మండిపడ్డారు. భవన నిర్మాణం పూర్తి కాకపోవడం వల్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించి పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం పోస్టుమార్టం సౌకర్యం లేక మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించాల్సి వస్తోందని, ఇది బాధిత కుటుంబాలకు తీవ్ర ఇబ్బందిగా మారిందని గుర్తు చేశారు.నిధుల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, వైద్య రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని హెచ్చరించారు.వెంటనే అధికారులు స్పందించి, ఆసుపత్రిలోని లోపాలను సరిదిద్దాలని, కొత్త భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నేతలు ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మేడ్చల్ మండల నాయకులు రమేష్, నర్సింగ్ రావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# పటాన్చెరులో అత్యాధునిక వైద్య సేవలకు శ్రీకారం

- 25వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరం – ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి

**పటాన్చెరు, జూన్ 13 :**

ప్రజలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో పటాన్చెరు–ఇంద్రేశం వెళ్లే రహదారిపై ప్రాచీన్ గ్లోబల్ ఆసుపత్రి సేవలను ప్రారంభించింది. త్వరలో ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ వరకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది.ఈ ఉచిత వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులచే ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, చికిత్సలు అందించబడుతున్నాయి. జనరల్ ఫిజీషియన్,







కార్డియాలజీ, డెర్మటాలజీ, గైనకాలజీ తదితర విభాగాలకు చెందిన నిపుణుల సేవలు అందుబాటులో ఉన్నాయి.అలాగే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎమ్మారై, సీటీ స్కాన్, ఎక్స్‌రే, డయాగ్నొస్టిక్స్ తదితర వైద్య సదుపాయాలు ఒకే చోట లభిస్తున్నాయని యాజమాన్యం తెలిపింది.ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఆసుపత్రి ప్రతినిధులు కోరారు. పరిసర ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.

# మెదక్ జిల్లా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గొల్ల ప్రభు యాదవ్

**తూప్రాన్, చేగుంట 13 జూన్ :**

మెదక్ జిల్లా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చేగుంట మండలానికి చెందిన గొల్ల ప్రభు యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ జాతీయ అధ్యక్షుడు ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా గొల్ల ప్రభు యాదవ్ మాట్లాడుతూ..బీసీ వర్గాల హక్కుల పరిరక్షణ సామాజిక ఆర్థిక, విద్యా అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. బీసీ సంక్షేమానికి సంస్థ చేపట్టే కార్యక్రమాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు కట్టుబడి ఉంటానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ఆర్. అరుణ్ కుమార్, జాతీయ వైస్ ప్రెసిడెంట్ పీ. మనోజ్ కుమార్ గౌడ్, బీసీ జాతీయ యువజన అధ్యక్షుడు టి. కిషోర్, గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. రమేష్ కుమార్ యాదవ్, బీసీ కన్వీనర్ లలితా యాదవ్, బీసీ జాయింట్ యాక్షన్ కన్వీనర్ మేకల రాములు యాదవ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ యాదవ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



# స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు రైతులకు తీవ్ర నష్టం: మధుర స్వామినాథన్



**హైదరాబాద్, జూన్ 13:**

స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు భారత రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త మధుర స్వామినాథన్ హెచ్చరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అరిబండి లక్ష్మీనారాయణ 8వ స్మారకోపన్యాసంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. అమెరికా, యూరోపియన్ దేశాల్లో రైతులకు భారీ సబ్సిడీలు లభిస్తుండగా, భారత రైతులు అసమాన పోటీని ఎదుర్కొంటున్నారని తెలిపారు. విదేశీ కార్పొరేట్లకు మార్కెట్లను అప్పగించడం వల్ల రైతులు మరింత నష్టపోతారని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేటీకరణ పెరుగుతోందని, విత్తనాలు, యంత్రాలు కొద్ది కంపెనీల చేతుల్లో కేంద్రీకృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాలు, ఎరువుల కొరత, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రైతులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు ఐక్యంగా కార్పొరేట్ విధానాలను ఎదుర్కొనేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, పలువురు ప్రొఫెసర్లు, వ్యవసాయ నిపుణులు, తెలంగాణ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

**సంగారెడ్డి, జూన్ 13:**

సంగారెడ్డి జిల్లా పెద్దకంజర్లలోని తెలంగాణ గిరిజన సంక్షేమ నివాస డిగ్రీ కళాశాల (బాలుర)లో 2026–27 విద్యా సంవత్సరానికి వివిధ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ సుక్క సునీలా తెలిపారు. బీఎస్సీ, బీజెడ్‌సీ, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్‌సీ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్, ఆనర్స్), బీఏ (హెచ్ఈపీ) కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత నాణ్యమైన విద్య, వసతి, భోజనం, డిజిటల్ తరగతి గదులు, ఆధునిక ప్రయోగశాలలు, క్రీడలు, జిమ్, వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 2025 లేదా 2026లో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని, సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9912834414, 9440887833, 8008070959 లేదా ప్రిన్సిపాల్ మొబైల్ 7702790377ను సంప్రదించవచ్చు.

# పాపికొండల పర్యటనలో నిలిచిపోయిన బోటు

**భద్రాచలం జూన్13:**

పాపికొండల పర్యటనకు వెళ్లిన పర్యాటకులు ఆందోళనకు గురయ్యారు. 89 మంది పర్యాటకులతో వెళ్తున్న బోటు దేవీపట్నం సమీపంలో సాంకేతిక లోపంతో మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు, బోటు నిర్వాహకులు వెంటనే అప్రమత్తమై పర్యాటకులందరినీ మరో బోటులోకి సురక్షితంగా తరలించారు. అందరూ క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

# సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం బీభత్సం

**సంగారెడ్డి జూన్13 :**

సంగారెడ్డి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. కొండాపూర్ మండలంలో గంటన్నర వ్యవధిలోనే 8.1 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. వర్షం ధాటికి జనజీవనం అస్తవ్యస్తమై, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సదాశివపేట వద్ద రహదారిపై భారీ వృక్షం విరిగిపడగా, సదాశివపేట చౌరస్తాలో బలమైన ఈదురుగాలులకు పోలీస్ ట్రాఫిక్ కంట్రోల్ షెడ్డు నేలకూలింది. అధికారులు అప్రమత్తమై ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.

# బంగారం ఆభరణాలను మెరిపిస్తామని మోసం

**తొగుట, జూన్ 13 :**

బంగారు ఆభరణాలను కొత్తవాటిలా మెరిపిస్తామని మహిళలతో నమ్మబలికి వారిని మోసం చేసి బంగారం కాజేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. మహిళలను మోసం చేస్తున్న ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం ఇద్దరు యువకులు ఈ తరహా మోసానికి పాల్పడిన ఘటనతో గ్రామస్తులతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు తమ వద్ద ఉన్న ప్రత్యేక పౌడర్, లిక్విడ్‌తో బంగారం, వెండి ఆభరణాలను తెల్లగా చేసి మెరిపిస్తామని చెప్పారు. అయితే చాలా మంది వారి మాటలను నమ్మలేదు. చివరకు గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటికి వెళ్లిన వారు ముందుగా ఆమె చేతులపై పౌడర్ వేసి ఆమెకు నమ్మకం కల్పించారు. ఆ తర్వాత అనూష మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, ఆమెతో పాటు ఆమె చెల్లి కాళ్లకు ఉన్న వెండి పట్ట గొలుసులను తీసుకుని శుభ్రం చేస్తామని చెప్పారు. ఏదో రసాయన ద్రావణంలో వాటిని ముంచి కొంతసేపటి తర్వాత తిరిగి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఆభరణాల బరువు తక్కువగా ఉన్నట్లు గమనించిన బాధితులు స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించగా సుమారు 8 గ్రాముల బంగారం కరిగించి కాజేసినట్లు గుర్తించారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. బంగారం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఇలాంటి మోసాలు, దొంగతనాలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చురకలు

ఆదివారం 14 జూన్ 2026



## భగ్గుమంటున్న బంగారం..

**హైదరాబాద్, జూన్ 13 :** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావంతో బంగారం ధరలు వరుసగా మూడో రోజు భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి పెరగడంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడులైన బంగారం, వెండివైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో దేశీయ మార్కెట్లలోనూ బంగారం ధరలు ఊహించని స్థాయిలో ఎగబాకుతున్నాయి. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం శనివారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.500 పెరిగి రూ.1,49,080కు చేరుకుంది. అలాగే 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.450 పెరిగి రూ.1,36,650 వద్ద ట్రేడవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర కూడా రూ.370 పెరిగి రూ.1,11,810కు చేరుకుంది. ఇదే సమయంలో వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాముల వెండిపై రూ.500, కిలో వెండిపై రూ.5,000 పెరుగుదల నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి రూ.27,000 వద్ద, కిలో వెండి రూ.2,70,000 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ పరిస్థితులు, ముడి చమురు ధరల పెరుగుదల, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## 'నో కాస్ట్ ఈఎంఐ' నిజంగానే లాభమా?

**హైదరాబాద్, జూన్ 13 :** డిజిటల్ చెల్లింపుల విస్తరణతో పాటు క్రెడిట్ కార్డుల వినియోగం దేశవ్యాప్తంగా గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా ఆన్‌లైన్ కొనుగోళ్ల సమయంలో అందించే ప్రత్యేక తగ్గింపులు, తక్షణ నగదు తిరిగి చెల్లింపు ఆఫర్లు, సులభ వాయిదా సదుపాయాలు వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'నో కాస్ట్ ఈఎంఐ' అనే ఆఫర్‌కు భారీ ఆదరణ లభిస్తోంది. అయితే ఈ సదుపాయం నిజంగా ఎంతవరకు ప్రయోజనకరమనే విషయాన్ని వినియోగదారులు ముందుగా తెలుసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం టెలివిజన్లు, గాలి శీతలీకరణ పరికరాలు, మడత గణక యంత్రాలు, స్మార్ట్‌ఫోన్లు వంటి ఖరీదైన వస్తువులను చాలామంది క్రెడిట్ కార్డు ద్వారా వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులను ఆకర్షించేందుకు అనేక ఈ-వాణిజ్య సంస్థలు 'నో కాస్ట్ ఈఎంఐ' పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందిస్తున్నాయి. సాధారణంగా ఈ సదుపాయంలో వడ్డీ, నిర్వహణ రుసుములు లేదా ఇతర అదనపు ఖర్చులు లేవని ప్రచారం చేస్తారు. అయితే సాధారణ ఈఎంఐ విధానంలో వడ్డీతో పాటు నిర్వహణ రుసుములు, సేవా పన్నులు, ఆలస్య రుసుములు వంటి అదనపు భారాలు ఉంటాయి. నిర్ణీత తేదీలోపు వాయిదా చెల్లించకపోతే అధిక వడ్డీ విధించే అవకాశం కూడా ఉంటుంది. అలాగే రుణాన్ని ముందుగానే పూర్తిగా చెల్లించాలనుకుంటే ముందస్తు ముగింపు రుసుములు కూడా వసూలు చేస్తారు. ఈ రుసుములపై అదనంగా వస్తు సేవల పన్ను కూడా వర్తించడంతో మొత్తం ఖర్చు పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల ఏ వస్తువును వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసే ముందు సంబంధిత నిబంధనలను పూర్తిగా పరిశీలించడం అవసరం. వడ్డీ రేట్లు, నిర్వహణ రుసుములు, ముందస్తు ముగింపు ఛార్జీలు, ఆలస్య రుసుములు వంటి అంశాలను జాగ్రత్తగా చదవాలి. కేవలం తగ్గింపు లభిస్తోందనే కారణంతో కొనుగోలు చేయకుండా, ఆ వస్తువు నిజంగా అవసరమా అనే విషయాన్ని కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అనేక మంది భారీ తగ్గింపుల మోజులో అవసరం లేని వస్తువులను కూడా కొనుగోలు చేస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా 'నో కాస్ట్ ఈఎంఐ' అనే ప్రకటన చూసి వెంటనే నిర్ణయం తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి కొనుగోలు చేసే ముందు కుటుంబ ఆదాయం, నెలవారీ ఖర్చులు, భవిష్యత్ ఆర్థిక బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు. ఆకర్షణీయమైన ఆఫర్లు కనిపించినప్పటికీ, వాటి వెనుక ఉన్న నిబంధనలను పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాతే వాయిదాల సదుపాయాన్ని ఉపయోగించుకోవడం ఆర్థికంగా సురక్షితమైన నిర్ణయంగా భావించవచ్చు.




# పాస్‌పోర్ట్ రంగుల వెనుక అసలు రహస్యం ఇదే!




**హైదరాబాద్, జూన్ 13 :** విమానాశ్రయాల్లో ఇమ్మిగ్రేషన్ క్యూలలో నిలబడినప్పుడు కొందరి పాస్‌పోర్ట్‌లు నీలం రంగులో, మరికొందరివి తెలుపు, మరికొన్నివి ముదురు ఎరుపు లేదా నారింజ రంగులో కనిపిస్తుంటాయి. ఈ రంగుల మధ్య తేడా ఎందుకు ఉంటుందనే సందేహం చాలామందికి వస్తుంది. పాస్‌పోర్ట్‌ల రంగులను నిర్ణయించే విషయంలో ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి అంతర్జాతీయ చట్టం లేకపోయినా, ఒక్కో దేశం తన అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక రంగులను ఎంపిక చేస్తుంది. అయితే భారతదేశంలో పాస్‌పోర్ట్ రంగులు వ్యక్తుల హోదా, ప్రయాణ అవసరాలు, విధుల ఆధారంగా నిర్ణయించబడతాయి. భారతదేశంలో అత్యధిక మంది పౌరులు ఉపయోగించేది నీలం రంగు పాస్‌పోర్ట్. దీనిని వ్యక్తిగత పాస్‌పోర్ట్‌గా పరిగణిస్తారు. విదేశీ పర్యటనలు, విద్య, వ్యాపారం లేదా ఇతర వ్యక్తిగత అవసరాల కోసం విదేశాలకు వెళ్లే సాధారణ పౌరులకు ఈ పాస్‌పోర్ట్ జారీ చేస్తారు. ఈ పాస్‌పోర్ట్ కలిగినవారు సాధారణ వీసా, ఇమ్మిగ్రేషన్ నిబంధనలను అనుసరించాల్సి ఉంటుంది. తెలుపు రంగు పాస్‌పోర్ట్‌ను ప్రభుత్వ సేవా పాస్‌పోర్ట్‌గా పిలుస్తారు. కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక విధుల కోసం విదేశాలకు వెళ్లే ఉన్నతాధికారులు, ప్రభుత్వ ఉద్యోగులకు దీనిని జారీ చేస్తారు. ఈ పాస్‌పోర్ట్ కలిగిన వారికి విమానాశ్రయాల్లో ప్రత్యేక గుర్తింపు లభించడంతో పాటు ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తవుతుంది. ముదురు ఎరుపు లేదా మెరూన్ రంగు పాస్‌పోర్ట్‌ను అత్యంత ప్రత్యేక హోదా కలిగిన వ్యక్తులకు అందజేస్తారు. భారత దౌత్యవేత్తలు, విదేశాంగ శాఖ అధికారులు, కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఉన్నత న్యాయమూర్తులు వంటి ప్రముఖులకు ఈ పాస్‌పోర్ట్ జారీ అవుతుంది. అంతర్జాతీయ వేదికలపై భారత దేశానికి ప్రాతినిధ్యం వహించే వారికి ఇది గుర్తింపుగా ఉంటుంది. అనేక దేశాల్లో వీరికి ప్రత్యేక దౌత్య సౌకర్యాలు, వీసా మినహాయింపులు కూడా లభిస్తాయి. నారింజ రంగు పాస్‌పోర్ట్‌ను విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే కొంతమంది కార్మికుల భద్రత కోసం ప్రవేశపెట్టారు. ముఖ్యంగా తక్కువ విద్యార్హత కలిగిన, విదేశీ ఉపాధి కోసం వెళ్లే వ్యక్తులను గుర్తించడం, వారి ప్రయాణ భద్రతను పర్యవేక్షించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇలాంటి పాస్‌పోర్ట్ కలిగిన వారు విదేశాలకు వెళ్లే ముందు అదనపు వలస అనుమతులు పొందాల్సి ఉంటుంది. పాస్‌పోర్ట్ రంగుల ద్వారా విమానాశ్రయ అధికారులు ప్రయాణికుడి హోదా, ప్రయాణ ఉద్దేశాన్ని సులభంగా గుర్తించగలుగుతారు. అందువల్ల ఇమ్మిగ్రేషన్ ప్రక్రియ మరింత సమర్థవంతంగా సాగుతుంది. తదుపరి సారి మీరు విమానాశ్రయానికి వెళ్లినప్పుడు వివిధ రంగుల పాస్‌పోర్ట్‌లను గమనిస్తే, వాటి వెనుక ఉన్న ఈ ప్రత్యేకతను సులభంగా అర్థం చేసుకోగలుగుతారు.

# ఈఎంఐ బకాయిలు.. ఇల్లు వెంటనే వేలం వేయరా?






**హైదరాబాద్, జూన్ 13 :** నేటి కాలంలో గృహ రుణాలు తీసుకుని ఇళ్లను కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగింది. చాలా మంది తమ నెలవారీ ఆదాయంలో పెద్ద భాగాన్ని గృహ రుణ ఈఎంఐల చెల్లింపులకే కేటాయిస్తున్నారు. దీంతో ఏ పరిస్థితుల్లోనైనా ఈఎంఐలను సకాలంలో చెల్లించాలని ప్రయత్నిస్తుంటారు. అయితే ఒకవేళ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈఎంఐలు చెల్లించలేకపోతే బ్యాంకులు వెంటనే ఇంటిని వేలం వేస్తాయా అనే సందేహం చాలా మందిలో ఉంటుంది. నిపుణుల ప్రకారం, ఒక్కటి లేదా రెండు ఈఎంఐలు బకాయి పడినంత మాత్రాన బ్యాంకులు వెంటనే ఇంటిని స్వాధీనం చేసుకుని వేలం వేయవు. ముందుగా రుణగ్రహీతకు హెచ్చరికలు జారీ చేసి, బకాయిలను చెల్లించుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. సమస్యను పరిష్కరించుకునేందుకు తగిన సమయం కూడా ఇస్తాయి. భారతీయ రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం, వరుసగా మూడు నెలల పాటు లేదా సుమారు 90 రోజుల పాటు ఈఎంఐలు చెల్లించకపోతే ఆ రుణ ఖాతాను నిరర్థక ఆస్తిగా ప్రకటిస్తారు. అనంతరం బ్యాంకు చట్టపరమైన చర్యలకు శ్రీకారం చుడుతుంది. రుణగ్రహీతకు లిఖితపూర్వకంగా నోటీసు జారీ చేసి, బకాయి మొత్తాన్ని చెల్లించేందుకు 60 రోజుల గడువు ఇస్తుంది. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రుణగ్రహీత స్పందించకపోతే బ్యాంకు ఆస్తిని స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించవచ్చు. అయితే వేలానికి ముందు కూడా మరో నోటీసు జారీ చేయడం తప్పనిసరి. ఇందులో ఆస్తి విలువ, వేలం తేదీ వంటి వివరాలను పేర్కొంటూ కనీసం 30 రోజుల ముందుగానే సమాచారం అందించాలి. అంటే రుణ ఖాతా నిరర్థక ఆస్తిగా మారిన వెంటనే ఇల్లు వేలం వెళ్లదు. నోటీసులు, గడువులు, చట్టపరమైన ప్రక్రియలన్నీ పూర్తయ్యాకే తదుపరి చర్యలు చేపడతారు. సాధారణంగా మొదటి ఈఎంఐ బకాయి పడిన రోజు నుంచి వేలం ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఎనిమిది నుంచి పన్నెండు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో రుణగ్రహీతకు బకాయిలు చెల్లించి ఖాతాను సక్రమంగా మార్చుకునే అవకాశం ఉంటుంది. అవసరమైతే బ్యాంకుతో చర్చించి రుణ పునర్వ్యవస్థీకరణ, గడువు పొడిగింపు వంటి ప్రత్యామ్నాయాలను కూడా పరిశీలించవచ్చు. అందువల్ల ఈఎంఐ బకాయిలు వచ్చిన వెంటనే భయపడకుండా, బ్యాంకుతో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

# రూ.2.5 లక్షల్లోపు బెస్ట్ స్క్రాంబ్లర్ ఏది?

### రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 vs యెజ్డీ స్క్రాంబ్లర్




**హైదరాబాద్, జూన్13 :** దేశీయ మార్కెట్‌లో అడ్వెంచర్, స్క్రాంబ్లర్ బైక్‌లకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. నగర రోడ్లతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని కంకర రోడ్లు, గుంతలు, తేలికపాటి ఆఫ్‌రోడింగ్ పరిస్థితుల్లోనూ సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుండటంతో యువత ఈ బైక్‌లపై ఆసక్తి చూపుతోంది. ప్రస్తుతం రూ.2.5 లక్షల్లోపు ధరలో రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440, యెజ్డీ స్క్రాంబ్లర్ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440లో 443 సీసీ సింగిల్ సిలిండర్, ఎయిర్ కూల్డ్, ఫ్యూయల్ ఇంజెక్టెడ్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది గరిష్ఠంగా 25.4 బీహెచ్‌పీ పవర్, 34 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో 6 స్పీడ్ గేర్‌బాక్స్‌ను అందించారు. తక్కువ ఆర్‌పీఎం వద్ద అధిక టార్క్ అందించడం వల్ల కొండ ప్రాంతాలు, కఠినమైన రోడ్లపై ప్రయాణానికి ఈ బైక్ అనుకూలంగా ఉంటుంది. అదే యెజ్డీ స్క్రాంబ్లర్‌లో 334 సీసీ సింగిల్ సిలిండర్, లిక్విడ్ కూల్డ్ ఇంజిన్‌ను అందించారు. ఇది 29.59 బీహెచ్‌పీ పవర్, 30 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పవర్ పరంగా యెజ్డీ ముందంజలో ఉండగా, టార్క్ విషయంలో స్క్రామ్ 440 ఆధిపత్యం చూపుతోంది. హైవే రైడింగ్, వేగవంతమైన యాక్సిలరేషన్ కోరుకునేవారికి యెజ్డీ మంచి ఎంపికగా నిలుస్తుంది. డిజైన్ పరంగా స్క్రామ్ 440లో 795 మిల్లీమీటర్ల సీటు ఎత్తు ఉండటంతో పొట్టిగా ఉన్నవారు కూడా సులభంగా నడపవచ్చు. 200 మిల్లీమీటర్ల గ్రౌండ్ క్లియరెన్స్, 196 కిలోల బరువుతో ఈ బైక్ బలమైన నిర్మాణాన్ని కలిగి ఉంది. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో సీటు ఎత్తు 813 మిల్లీమీటర్లు కాగా, మొత్తం బరువు కేవలం 174 కిలోలు మాత్రమే. తక్కువ బరువు కారణంగా ట్రాఫిక్‌లో, మలుపుల వద్ద మరింత చురుకైన హ్యాండ్లింగ్‌ను అందిస్తుంది. బ్రేకింగ్, సస్పెన్షన్ విషయంలో స్క్రామ్ 440లో ముందు 300 మిల్లీమీటర్ల, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. ముందు టెలిస్కోపిక్ ఫోర్క్‌లు, వెనుక మోనోషాక్ సస్పెన్షన్ వ్యవస్థను అందించారు. యెజ్డీ స్క్రాంబ్లర్‌లో ముందు 320 మిల్లీమీటర్ల, వెనుక 240 మిల్లీమీటర్ల డిస్క్ బ్రేక్‌లతో పాటు డ్యూయల్ ఛానల్ ఏబీఎస్‌ను అందించారు. ఇంధన ట్యాంక్ విషయానికి వస్తే స్క్రామ్ 440లో 15 లీటర్ల పెద్ద ట్యాంక్ ఉండగా, యెజ్డీ స్క్రాంబ్లర్‌లో 12.5 లీటర్ల ట్యాంక్‌ను అందించారు. దీర్ఘ ప్రయాణాలకు స్క్రామ్ 440 మరింత ఉపయోగకరంగా ఉండగా, తక్కువ బరువు కారణంగా యెజ్డీ ఇంధన వినియోగంలో కొంత మెరుగైన సామర్థ్యాన్ని అందించే అవకాశం ఉంది. ధర పరంగా రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 ప్రారంభ ఎక్స్‌షోరూం ధర రూ.2.23 లక్షలు కాగా, యెజ్డీ స్క్రాంబ్లర్ ప్రారంభ ధర రూ.1.99 లక్షలుగా ఉంది. అంటే యెజ్డీ బైక్ సుమారు రూ.24 వేల తక్కువ ధరకే అందుబాటులో ఉంది. బలమైన నిర్మాణం, అధిక టార్క్, టూరింగ్ సామర్థ్యం ముఖ్యమైతే రాయల్ ఎన్‌ఫీల్డ్ స్క్రామ్ 440 సరైన ఎంపికగా నిపుణులు సూచిస్తున్నారు. అదే తక్కువ బరువు, ఎక్కువ పవర్, చురుకైన హ్యాండ్లింగ్, తక్కువ ధరలో స్క్రాంబ్లర్ బైక్ కోరుకునేవారికి యెజ్డీ స్క్రాంబ్లర్ మంచి ప్రత్యామ్నాయంగా నిలుస్తుంది.

# అమెరికా ఘన ఆరంభం.. పరాగ్వేపై నాలుగు గోల్స్‌తో భారీ విజయం

**ఇంగిల్‌వుడ్, జూన్ 13 :** ఫిఫా ప్రపంచకప్‌లో ఆతిథ్య దేశం అమెరికా విజయవంతమైన ఆరంభం చేసింది. గ్రూప్–డి మ్యాచ్‌లో పరాగ్వేపై 4–1 గోల్స్ తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసి టోర్నీలో శుభారంభం చేసింది. దక్షిణ కాలిఫోర్నియాలో జరిగిన ఈ పోరులో అమెరికా జట్టు ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. మ్యాచ్ ప్రారంభమైన ఏడో నిమిషంలోనే డీ బోడాడిల్లా గోల్ చేసి అమెరికాకు ఆధిక్యం అందించాడు. అనంతరం ఫోలారిన్ బలోగన్ 31వ నిమిషం, 45వ నిమిషంలో వరుసగా రెండు గోల్స్ సాధించి జట్టును మరింత బలమైన స్థితిలో నిలిపాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సమయానికి అమెరికా 3–0 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలో కూడా అమెరికా దూకుడు కొనసాగించింది. మ్యాచ్ చివరి నిమిషంలో జియో రేనా మరో గోల్ నమోదు చేయగా, పరాగ్వే తరఫున మౌరిసియో 73వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. ఫలితంగా అమెరికా 4–1 తేడాతో ఘన విజయం అందుకుంది. ప్రపంచకప్ చరిత్రలో అమెరికా ఒకే మ్యాచ్‌లో నాలుగు గోల్స్ చేయడం ఇదే తొలిసారి. అంతేకాకుండా ప్రపంచకప్ పోటీల్లో తొలి అర్ధభాగంలోనే మూడు గోల్స్ నమోదు చేయడం కూడా అమెరికాకు ఇదే మొదటి సందర్భం. ఖతార్‌లో జరిగిన గత ప్రపంచకప్‌లో నాలుగు మ్యాచ్‌లు ఆడిన అమెరికా మొత్తం మూడు గోల్స్ మాత్రమే నమోదు చేసింది. అలాంటి జట్టు ఈసారి తొలి మ్యాచ్‌లోనే నాలుగు గోల్స్ సాధించడం విశేషంగా నిలిచింది. ఈ విజయానికి హీరోగా నిలిచిన ఫోలారిన్ బలోగన్ కథ కూడా ఆసక్తికరంగా మారింది. నైజీరియా మూలాలు కలిగిన బలోగన్ అమెరికాలో జన్మించి, అనంతరం కుటుంబంతో




కలిసి ఇంగ్లాండ్‌కు వెళ్లాడు. యువస్థాయిలో ఇంగ్లాండ్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు, చివరకు అమెరికా జట్టును ఎంచుకున్నాడు. ప్రస్తుతం 24 ఏళ్ల వయస్సులోనే ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. మరోవైపు ప్రపంచకప్‌కు సహ–ఆతిథ్య దేశంగా ఉన్న కెనడా తన తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. బోస్నియాతో జరిగిన పోరులో ఇరు జట్లు 1–1 గోల్స్‌తో సమంగా నిలిచాయి. తొలి అర్ధభాగంలో లూకిక్ గోల్ చేయడంతో బోస్నియా ఆధిక్యంలోకి వెళ్లగా, రెండో అర్ధభాగంలో ప్రత్యామ్నాయ ఆటగాడిగా బరిలోకి దిగిన సీ లారిన్ 78వ నిమిషంలో గోల్ చేసి కెనడాకు సమం చేశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ప్రపంచకప్ ఆరంభ దశలోనే అమెరికా భారీ విజయంతో తన సత్తా చాటగా, కెనడా కీలక పాయింట్‌తో టోర్నీ ప్రయాణాన్ని ప్రారంభించింది.బౌలింగ్ దళంతో బరిలోకి దిగడం సెలక్టర్లకు ఇష్టం లేకపోయినా, సిరాజ్ గైర్హాజరీలో యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఈ మ్యాచ్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగం కాకపోయినా, భవిష్యత్ సిరీస్‌లకు జట్టును సిద్ధం చేసే దిశగా కీలకంగా మారింది. అనంతరం ఇరు జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పనిభార నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తున్న భారత క్రికెట్ నియంత్రణ మండలి సిరాజ్ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. అతడు ఆడతాడా లేదా అనే విషయంపై త్వరలోనే స్పష్టత రానుంది.



## ఫిఫా ప్రపంచకప్‌కు ముందు అమెరికాకు భద్రతా సవాల్

### కీలక నిఘా చట్టం గడువు ముగింపు

ప్రతిష్ఠాత్మక ఫిఫా ప్రపంచకప్ ప్రారంభానికి ముందు అమెరికా జాతీయ భద్రతలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా నిఘా సంస్థలైన సీఐఏ, ఎఫ్‌బీఐ, ఎన్ఎస్ఏలకు విదేశీ అనుమానితుల కమ్యూనికేషన్లను పర్యవేక్షించేందుకు అత్యంత ముఖ్యమైన అధికారాలను కల్పించే 'ఫారిన్ ఇంటెలిజెన్స్ సర్వైలెన్స్ యాక్ట్ ' లోని సెక్షన్–702 గడువు ముగిసింది. చట్టాన్ని పొడిగించే విషయంలో కాంగ్రెస్‌లో రాజకీయ విభేదాల వల్ల ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. పౌరుల గోప్యతకు భంగం కలుగుతుందన్న విమర్శల నేపథ్యంలో బిల్లు ఆమోదం పొందలేదు. అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా 48 దేశాలు పాల్గొనే ఫిఫా ప్రపంచకప్‌నకు ఆతిథ్యం ఇస్తున్న తరుణంలో ఈ చట్టపరమైన అనిశ్చితి భద్రతా వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రపంచకప్ వేళ ఉగ్రవాద ముప్పులను అడ్డుకోవడమే తమ ప్రాధాన్యత అని ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ స్పష్టం చేశారు. మరోవైపు, గూగుల్, మెటా వంటి టెక్ కంపెనీలు చట్టపరమైన రక్షణ లేకుండా డేటా అందించేందుకు వెనుకాడితే నిఘా వ్యవస్థకు ఇబ్బందులు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇరాన్ ఉద్రిక్తతలు, అమెరికా 250వ స్వాతంత్ర్య వేడుకల భద్రత దృష్ట్యా ఈ అంశంపై కాంగ్రెస్ త్వరలోనే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది.




## రోహిత్ శర్మ అరుదైన రికార్డు.. అమర్‌నాథ్ ఘనతకు చెక్!

**ధర్మశాల:** టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌లో మరో అరుదైన మైలురాయిని చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో ధర్మశాలలో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన హిట్‌మ్యాన్, భారత వన్డే చరిత్రలో అత్యంత పెద్ద వయసులో మ్యాచ్ ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో 1989 నుంచి మొహిందర్ అమర్‌నాథ్ (39 ఏళ్ల 36 రోజులు) పేరిట ఉన్న రికార్డును రోహిత్ (39 ఏళ్ల 44 రోజులు) అధిగమించాడు. 2027 వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా సాగుతున్న ఈ సిరీస్‌లో రోహిత్ అనుభవం జట్టుకు కీలకంగా మారింది. ఇప్పటికే టెస్టు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్, వన్డేల్లో తన ఫామ్‌ను కొనసాగిస్తూ యువ ఆటగాళ్లకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో ఇప్పటికే 11 వేలకు పైగా వన్డే పరుగులు సాధించి విజయవంతమైన బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు.



## బంగ్లాదేశ్ క్రికెటర్ నయీమ్ హసన్‌పై పోలీసుల దాడి

### క్రీడా వర్గాల్లో సంచలనం

**చిట్టగాంగ్:**
బంగ్లాదేశ్ జాతీయ టెస్ట్ జట్టు ఆఫ్‌స్పిన్నర్ నయీమ్ హసన్‌పై పోలీసులు దురుసుగా ప్రవర్తించడమే కాకుండా శారీరకంగా దాడి చేశారన్న ఆరోపణలు బంగ్లాదేశ్ క్రికెట్ వర్గాల్లో సంచలనంగా మారాయి. ప్రీమియర్ లీగ్ మ్యాచ్ ముగించుకుని ఢాకా నుంచి చిట్టగాంగ్ చేరుకున్న నయీమ్, అర్ధరాత్రి ఆటోలో ఇంటికి వెళ్తుండగా లంకన్ బజార్ ఫ్లైఓవర్ సమీపంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆటో పత్రాల పరిశీలన అనంతరం, తన బ్యాగ్ కూడా తనిఖీ చేసుకోవచ్చని చెప్పినప్పటికీ, పోలీసులు తన గొంతు పట్టుకుని వాహనంలోకి ఎక్కేలా బలవంతం చేశారని, ప్రశ్నించినందుకు బయటకు తోసేసి కొట్టారని నయీమ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తాను జాతీయ క్రికెటర్‌ని అని చెప్పినా వినలేదని, ఆ తర్వాత ఉన్నతాధికారుల నుంచి ఫోన్ కాల్స్ రావడంతోనే పోలీసులు వెనక్కి తగ్గారని తెలిపాడు. త్వరలో జింబాబ్వేతో జరగనున్న టెస్ట్ సిరీస్‌కు నయీమ్ ఎంపికైన తరుణంలో ఈ ఘటన ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై చిట్టగాంగ్ మెట్రోపాలిటన్ పోలీస్ డిప్యూటీ కమిషనర్ అమీరుల్ ఇస్లాం స్పందిస్తూ.. ఈ అంశంపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## వన్డేల్లో రోహిత్ శర్మ అరుదైన రికార్డు.. అమర్‌నాథ్ ఘనత బ్రేక్!

ధర్మశాల:
ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న తొలి వన్డేలో బరిలోకి దిగిన టీమిండియా స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ సరికొత్త రికార్డు సృష్టించాడు. భారత వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత ఎక్కువ వయసులో మ్యాచ్ ఆడిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో 1989 నాటి మొహిందర్ అమర్‌నాథ్ (39 ఏళ్ల 36 రోజులు) రికార్డును రోహిత్ శర్మ (39 ఏళ్ల 44 రోజులు) అధిగమించాడు. టెస్టులు, టీ20లకు ఇప్పటికే రిటైర్మెంట్ ఇచ్చిన హిట్‌మ్యాన్, ప్రస్తుతం వన్డేలపైనే దృష్టి పెట్టాడు. 2027 వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా జరుగుతున్న ఈ సిరీస్‌లో విరాట్ కోహ్లీ దూరం కావడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రోహిత్ అనుభవం కీలకంగా మారింది. 39 ఏళ్ల వయసులోనూ అద్భుత ఫిట్‌నెస్‌తో రాణిస్తూ రోహిత్ యువ ప్లేయర్లకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.



# సెమీస్‌లో సింధుకు నిరాశ.. ఫైనల్ చేరిన యమగుచి

సిడ్నీ, జూన్ 13 :
ఆస్ట్రేలియన్ బ్యాడ్మింటన్ ఓపెన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం సెమీఫైనల్స్‌లో ముగిసింది. జపాన్‌కు చెందిన ప్రపంచ అగ్రశ్రేణి క్రీడాకారిణి అకానే యమగుచి చేతిలో సింధు వరుస గేమ్‌లలో పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. 43 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో యమగుచి 22-20, 21-12 తేడాతో విజయం సాధించింది. ప్రపంచ మూడో ర్యాంక్ క్రీడాకారిణిగా బరిలోకి దిగిన యమగుచి కీలక సందర్భాల్లో మెరుగైన ఆటతీరు ప్రదర్శించి ఫైనల్‌కు అర్హత సాధించింది. మొదటి గేమ్‌లో సింధు గట్టి పోటీ ఇచ్చింది. ప్రతి పాయింట్ కోసం ఇరు క్రీడాకారిణులు తీవ్రంగా పోరాడారు. ఒక దశలో వరుసగా పాయింట్లు సాధిస్తూ సమాన స్థాయిలో నిలిచారు. అయితే గేమ్



ముగింపు సమయంలో యమగుచి మెరుగైన ప్రదర్శన కనబరిచి తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మాత్రం యమగుచి పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన జపాన్ క్రీడాకారిణి 13-6 ఆధిక్యంలోకి వెళ్లి సింధుపై ఒత్తిడి పెంచింది. సింధు తిరిగి పోటీలోకి రావడానికి ప్రయత్నించినప్పటికీ యమగుచి అవకాశమే ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. ఈ ఓటమితో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో భారత క్రీడాకారుల ప్రస్థానం ముగిసింది. ఇక మహిళల సింగిల్స్ ఫైనల్లో యమగుచి, థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పావీ చోచువాంగ్‌తో తలపడనుంది. ఇటీవలి కాలంలో యమగుచి చేతిలో సింధు వరుసగా పరాజయాలు ఎదుర్కొంటోంది. గత ఆరు ముఖాముఖి పోటీల్లో ఐదు సార్లు జపాన్ క్రీడాకారిణే విజయం సాధించింది. అయినప్పటికీ మొత్తం ముఖాముఖి రికార్డుల్లో మాత్రం పీవీ సింధు 15–13 ఆధిక్యంలో కొనసాగుతోంది.

# తన పేరుతో మోసాలు..

## అభిమానులను హెచ్చరించిన మీనాక్షి చౌదరి

హైదరాబాద్, జూన్ 13 :
'లక్కీ భాస్కర్' చిత్ర విజయంతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మీనాక్షి చౌదరి తాజాగా తన పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ఆందోళన వ్యక్తం చేశారు. తనను అనుకరిస్తూ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అభిమానులను, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించిన మీనాక్షి చౌదరి, తన పేరును ఉపయోగిస్తూ నకిలీగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఫోన్ నంబర్‌కు సంబంధించిన చిత్రాన్ని తన అధికారిక ఖాతాలో పంచుకున్నారు. ఆ నంబర్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లేదా సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. సదరు నంబర్ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన ఆమె, అలాంటి సందేశాలు లేదా కాల్స్ వస్తే వెంటనే ఆ నంబర్‌ను నిరోధించి, సంబంధిత వేదికలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మోసాన్ని గుర్తించి తన దృష్టికి తీసుకొచ్చిన అభిమానులు, సామాజిక మాధ్యమ వినియోగదారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ప్రముఖుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో అభిమానులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇక సినీ ప్రస్థాన విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'వృషకర్మ' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పౌరాణిక అంశాలు, ఉత్కంఠభరిత కథాంశంతో రూపొందుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాపై సినీ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.



# రూ.400 కోట్ల దిశగా దూసుకెళ్తున్న 'పెద్ది'



హైదరాబాద్, జూన్ 13 :
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. భావోద్వేగాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ జీవనశైలిని మేళవించి రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో ముందుకు సాగుతోంది. విడుదలైన తొలి రోజు నుంచే సానుకూల స్పందన అందుకున్న ఈ చిత్రం తాజాగా మరో కీలక మైలురాయిని చేరుకుంది. విడుదలై తొమ్మిది రోజులు పూర్తైన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించిన వివరాల ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ వసూళ్లతో రామ్ చరణ్ సినీ ప్రయాణంలో అత్యధిక ఆదరణ పొందిన చిత్రాల్లో ఒకటిగా నిలిచిన 'పెద్ది', సోలో హీరోగా ఆయన నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యంలో సాగే కథ, క్రీడా అంశాలు, హృదయాన్ని తాకే భావోద్వేగ సన్నివేశాలు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం వారాంతపు ప్రదర్శనలకు కూడా మంచి స్పందన లభిస్తున్నట్లు సినీ వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశీ మార్కెట్లలోనూ చిత్రం నిలకడైన వసూళ్లు సాధిస్తోంది. దీంతో 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెద్ద చిత్రాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం సినిమాకు అదనపు బలంగా మారింది. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడి పాత్ర కోసం చేసిన కృషి చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సనా కథను హృద్యంగా తెరకెక్కించడంలో విజయవంతమయ్యారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'పెద్ది' విజయయాత్ర ఇంకా కొనసాగుతుండటంతో రాబోయే రోజుల్లో మరిన్ని వసూళ్ల రికార్డులను సొంతం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం సినీ అభిమానుల దృష్టంతా ఈ చిత్రం ఎంత వేగంగా రూ.400 కోట్ల మార్కును చేరుకుంటుందన్న అంశంపైనే కేంద్రీకృతమైంది.



# కంఫర్ట్ జోన్ దాటి నటించా..

## 'ఇకాయ్' నా కెరీర్‌లోనే పెద్ద సవాల్: సయీ మంజ్రేకర్

ముంబై :
'మేజర్', 'స్కంద' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి సయీ మంజ్రేకర్ ప్రస్తుతం నటిస్తున్న 'ఇకాయ్' చిత్రం తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్న సినిమా అని వెల్లడించారు. రాఘవ్ జుయల్ హీరోగా నటిస్తున్న ఈ రొమాంటిక్ హారర్ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సయీ మంజ్రేకర్, ఇప్పటివరకు తాను చేసిన చిత్రాల్లో 'ఇకాయ్' తనకు అతిపెద్ద సవాలుగా నిలిచిందని తెలిపారు. ఈ సినిమా కోసం కొన్ని సందర్భాల్లో తన కంఫర్ట్ జోన్ దాటి నటించాల్సి వచ్చిందని, కొన్ని భావోద్వేగ సన్నివేశాల్లో సహజత్వాన్ని తీసుకురావడం కష్టంగా అనిపించినప్పటికీ, అలాంటి అనుభవాలే ఒక నటిగా తనను మరింత మెరుగుపరుస్తాయని చెప్పారు. ఈ చిత్రంలో ప్రేక్షకులు తన నటనలోని కొత్త కోణాన్ని చూడబోతున్నారని సయీ ఆశాభావం వ్యక్తం చేశారు. యాక్షన్, డ్రామా తరహా పాత్రలకు భిన్నంగా రొమాంటిక్ హారర్ కథలో నటించడం తన కెరీర్‌కు కొత్త అనుభవాన్ని అందించిందని పేర్కొన్నారు. రాజ్ సింగ్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ముంబైలోని కొలాబా ప్రాంతంలో జరిగింది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'ఇకాయ్' చిత్రాన్ని 2027 ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# దృశ్యం 3' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..!

## ఈ నెల 18 నుంచే స్ట్రీమింగ్

**హైదరాబాద్:** మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూన్ 18 నుండి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి కేవలం మలయాళ భాషలో మాత్రమే ఇది అందుబాటులోకి రానుండగా, తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల డబ్బింగ్ వెర్షన్ల విడుదలపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో జార్జ్‌కుట్టిగా మోహన్‌లాల్ నటన, ఉత్కంఠభరిత మలుపులతో మెప్పించిన ఈ చిత్రం కోసం ఓటీటీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






# దిశా పటాని సక్సెస్ స్టోరీ

## రూ. 500లతో వచ్చి స్టార్ హీరోయిన్‌గా..!

**ముంబై:** గ్లామర్ బ్యూటీ దిశా పటాని సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమలోకి వచ్చిన ఆమె, నేడు బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దిశా, చదువులో టాలెంటెడ్. మొదట పైలట్ లేదా శాస్త్రవేత్త కావాలనుకుని బయోటెక్నాలజీ ఇంజినీరింగ్ చేసింది. అయితే మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో తన వద్ద కేవలం రూ. 500 మాత్రమే ఉన్నాయని, ఎవరి సాయం లేకుండా స్వయంకృషితోనే అవకాశాలు వెతుక్కున్నానని ఆమె వెల్లడించింది. 2015లో తెలుగు సినిమా 'లోఫర్'తో కెరీర్ ప్రారంభించిన దిశా, 2016లో వచ్చిన 'ఎంఎస్ ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. ప్రస్తుతం గ్లామర్ ఫొటోషూట్లు, వరుస సినిమాలతో సోషల్ మీడియాలోనూ భారీ ఫాలోయింగ్‌తో దూసుకుపోతోంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com